# HANNA KRUPA

Christian Devotional Monthly Magazine

సంపుటి : 7　　　సంచిక : 3

ప్రభువగు యెహోవాయే నాకు బలము

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| నిత్యజీవజలము | నిత్యజీవజలము మాసపత్రిక సౌజన్యంతో | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహోయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 12 |
| మదర్ తెరీసా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| మకరజ్యోతి నిజమా? | ఈభూమి వారపత్రిక సౌజన్యంతో | 18 |
| సాక్ష్యము | పులుకూరి విక్టర్ అబ్రహాం | |
| | హోంమిషనరీ, కందుకూరు | 20 |
| ఆగష్టు నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 22 |
| సాక్ష్యము | రెవ.డా॥ కె.యం.జాన్, జనగాం | 23 |
| ప్రయాణంలో మజిలీ | కొడవటికంటి | 26 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 27 |
| ఏదినిజం?ఏదిఅబద్ధం? | వి.శేఖర్‌రెడ్డి, నెల్లూరు | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



Founder :
**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :
**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Hon. Editor :
**A.N.R. Zakkam**
D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :
**Yadavalli Prasada Rao**
D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushotham Reddy**
Superintendent, Rajareddy Hospital Pulivendula

**Rev. Dr. K. Joseph**
Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**
Director, Good News Messengers, Guntur


## చందా వివరములు

సంవత్సర చందా : రూ.150
జీవిత చందా : రూ. 3000
పోషక చందా : రూ. 5000


**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప,
54-1-23 (A), కృపాదానంవీధి, క్లాపేట,
6వ లైను, ఒంగోలు- 1.


హన్నాకృప
ఆధ్యాత్మిక మాస పత్రిక


ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362
బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు

సంపాదకీయం

# నా కుటుంబము



బైబిలు గ్రంథమంతటిలో దేవుడు కుటుంబమును ఏర్పాటు చేసిన నాటనుండి ప్రతి కుటుంబము ఆశీర్వదింప బడుటకు ఆ యింటి యజమాని కారకుడగుచున్నాడు.

బైబిలు గ్రంథములోనేకాక మన చుట్టుప్రక్కల నివశించే కుటుంబీకులనందరిని మనము ఎరిగేయున్నాము. మనం ఒంటరిగా వున్నప్పుడు మన చుట్టు వుండే క్రైస్తవ కుటుంబాల పితరులను గురించి తెలుసుకోవడం ఆలోచించటం ప్రారంభిస్తే ఇప్పుడు హెచ్చింపబడియున్న వారందరి (ధనములో కాక) సంతానము, ఆత్మీయత హెచ్చుగా వుండటానికి వారి పితరులే కారణము. అంటే పితరుల కుటుంబములు.

యిర్మీయా గ్రంథము 35వ అధ్యాయంలో దేవుడైన యెహోవా యిర్మీయాని రేకాబీయుల యొద్దకు పొమ్మని, పోయి వారి సంతానంలో ఎవరితోనైనా ద్రాక్షారసం త్రాగించ మంటాడు. యిర్మీయా రేకాబీయులలో కొందరిని రహస్య స్థలములో చేర్చి ద్రాక్షారసము త్రాగమని ద్రాక్షారసము పాత్రలు వారికిస్తే, వారు మా పితరుడగు రేకాబు కుమారుడైన యెహోనాదాబు, మీరైనను మీ సంతానము వారైనను ఎప్పుడును ద్రాక్షారసము త్రాగకూడదని మాకాజ్ఞాపించెను గనుక మేము త్రాగమన్నారు. అందుకు గాను దేవుడైన యెహోవా 19వ వచనంలో – కాబట్టి ఇశ్రాయేలు దేవుడును సైన్యములకు అధిపతియగు యెహోవా– నా సన్నిధిలో నిలచుటకు రేకాబు కుమారుడైన యెహోనాదా బునకు సంతతివాడు ఎన్నడును ఉండక మానడు అని సెలవిచ్చాడు. ఒక వ్యక్తి యెహోనాదాబు ద్వారా అతని కుటుంబాలకు ఎన్నటెన్నటికి నిలచివుండే దీవెన కలిగింది.

అదేవిధంగా దావీదు తన దేవుని విషయమైన ఆసక్తి – నేను దేవదారు మ్రానులతో కట్టబడిన నగరులో వున్నాను. యెహోవా నిబంధన మందసము తెరల చాటున వున్నది. కనుక ఆలయము కట్టాలనే అభిలాష నాతాను ప్రవక్తకు చెప్పాడు. అయితే దేవుడైన యెహోవా దావీదుతో మందిరము కట్టించక పోయినా దేవాలయము కట్టిన దీవెన –నిన్ను స్థాపించుటకై నేను కొట్టివేసిన సౌలునకు నా కృప దూరమైనట్లు నీ కుమారునికి నా కృప దూరము చేయను. నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అన్నాడు.

కాబట్టి దేవుడు మనకు అనుగ్రహించిన మన కుటుంబము, మన కుటుంబమే కాక మన కుటుంబములో నుండి వచ్చే అనేక తరములలోని కుటుంబములు దీవించబడుటకు మన కుటుంబమే కారణము కాగలదు.

నేడు మన పట్టణాలలో అద్భుతముగా హెచ్చింబడిన వ్యక్తులుగాని వారి సంతానముగాని వారికి పూర్వము నివసించిన వారి వలన దీవెన పొందియున్నారు. ఈ లోకములో మన కుటుంబము హెచ్చించబడాలంటే మంచి చదువులు చదవాలి. ఆ చదువులు చదివించటానికి కావలసిన ఆర్థిక స్థితి కొరకు ఎన్నో అడ్డదారులు తొక్కి, చివరికి శాపమే సంపాదిస్తున్నారు. ఉన్నత చదువులు చదివించాలని ముక్కు పచ్చులారని చిన్న వయస్సులోనే వారిని కుటుంబమునకు దూరపరచి ప్రతి మానవునికి దేవుడు అనుగ్రహించిన తల్లిదండ్రుల, అన్నదమ్ముల, అక్కచెల్లెండ్ర ప్రేమ మాధు ర్యాన్ని పారద్రోలుతున్నాము.

ఈ జీవితం చిన్నది నీడ వంటిది అని అందరూ ఒప్పుకుంటారు. కాని ప్రక్కవాని కుటుంబము కంటే మన కుటుంబము గొప్పగా ఉండాలని కాని, గొప్ప వాళ్ళ జాబితా లోకి మన కుటుంబము చేర్చబడాలని ఎంతో దుఃఖ పూరితమైన కుటుంబాన్ని మనం గడుపుతున్నాము.

వేలాది, లక్షలాది కుటుంబాల కంటే మన కుటుంబమును దేవుడు ఆర్థికంగా హెచ్చించినప్పటికీ అందుకు దేవునికి కృతజ్ఞత చెల్లించక వందలలో పదుల్లో మనకంటే హెచ్చింపబడిన కుటుంబాలను చూసి మనకు దేవుడిచ్చిన నెమ్మదిని సమాధానాన్ని పోగొట్టుకుంటాము.

"ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకనుగ్రహించబడును".

# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ



**" విహ్వ్య గోప్తారాం మహక్యాదధిన కర్యంతి హన్వా యాన పర్యతాసీన్ "**

ఈనాడు క్రైస్తవ్యమును లోకము ఒక మతమని ఇంకను అనుకుంటున్నారు. కాని క్రైస్తవ్యము మతము కాదు. ఇది మానవులు నడువవలసిన మార్గమైయున్నది. అందులకే క్రీస్తు – 'నేనే మార్గమును నా ద్వారా తప్ప యెవడును తండ్రి యొద్దకు రాలేడు' అని బోధించెను. ఆయన బోధించినది మతము కాదు. మార్గము. నేను కూడా బోధించునది మతము కాదు, మార్గము. యోహాను 14:6 నేను మీకు చదివి వినిపించుదును, వినండి అని ఇంకను అనేక విధములైన మాటలతో వారికి నచ్చజెప్పి పై వాక్యము చదివి వినిపించాను. అప్పుడు వారు 'అయ్యా! నిజం చెప్ప మంటారా? మేమెందుకు వచ్చామంటే మిమ్మును తలక్రిందులుగా ప్రశ్నించి ఈ ప్రాంతము నుండి వెళ్ళగొట్టాలని మాలో కొద్దిమంది తలం చాము. ఆ కారణాన ఆ విధమైన అనుమానము మీకు కలుగకుండ వుండేటట్లు ఇప్పుడే మీరన్నట్లు వేషధారులవలె వచ్చాము. తెల్లవారింది. మమ్మునేమి చేయమంటారు?' అని అడుగగా, నేను 'మీరు సమ్మతిస్తే మోకరించి నేను ప్రార్థించెదను' అన్నప్పుడు వారు ఆ మాటకు విధేయుల య్యారు. అప్పుడు నేను ప్రార్థించాను. అందరూ నాతో కరచాలనం చేశారు. నేనైతే వారిని కౌగలించుకున్నాను. ఇంక జరుగబోవు రెండు దినముల సభలకు ఆహ్వానించాను. వారంతా సభా స్థలమునకు అందరికంటే ముందుగా నేలపై కూర్చుని చేతులు జోడించి రెండు రోజులు విత్తబడిన వాక్యము విన్నారు. పిమ్మట వారిలో కొంతమందిని దర్శించితిని. దేవునికివ్వడమనేది వారికి నేర్పాను. అప్పుడు వారు కొబ్బరి గెలలు ప్రథమ ఫలముగా ఆలయమునకు తెచ్చియిచ్చినట్లుగా అక్కడి దైవజనుడు నాతో చెప్పాడు. అందులో ఒక యౌవన తాసిల్దారుగారు ఆ స్థానిక దైవజనుని పిలిపించి గృహములో ప్రార్థన చేయించుకుని దేవుని కొరకు కానుకలు యిచ్చినట్లు ఆ దైవజనుడు నాతో చెప్పాడు. దేవుడు వారికి మారుమనస్సు కలిగించి నూతనముగా సృష్టించి తన ఆత్మలో పెరుగుదల కలిగించును గాక! ఈ విధముగ ఒరిస్సాలో వాడబడితిని.

ఈ విధమైన పరిచర్య ఒరిస్సా రాష్ట్రంలో నేను చేయు చుండగా అక్కడ పరిచర్యకు అంతరాయం కలుగునట్లు దుష్టుడు ఓర్వలేక దైవసేవ చేస్తున్న కొంతమంది పరిచారకులను సాధనములుగా ఉపయోగించుకొని అభ్యంతరం కలిగించాడు. దుష్టుని చేతిలో సాధనములుగా వుపయోగించబడు వారు దురాత్మ కలవారేగాని, దైవాత్మ కలవారు కారని తెలుసు కున్నాను. వారు వారి సంఘములలో నన్ను ఒక పనిముట్టుగా ఉపయోగించుకోవాలని ఆశించాడు. నేను దేవునియొద్ద విచారించి అది దేవుని చిత్తము కాదని తెలిసికొని వారితో నేనేకభవించలేదు. ఈ కారణాన నాపై వారికి ద్వేషబుద్ధి కలిగి నేను వెళ్ళు ప్రతిచోట నా గత జీవితమును (నేను విగ్రహారాధీ కునిగా వున్నప్పుడు చేసిన అపవిత్ర కార్యములు) ప్రజలతో చెప్తూ దేవుని పని పాడుచేస్తుండేవారు. దేవుని పని పాడుచేయు వారు, ప్రియులారా! దేవునితోనే వ్యాజ్యెమాడువారైయున్నారు. దేవునితో వ్యాజ్యెమాడు వాడు దుష్టుడు. దేవునితో వ్యాజ్యె మాడు దుష్టుడు పరాజితుడైయున్నాడన్న సంగతి మీరెరుగరా? ప్రియ తోటి పనివాడా? ఒకవేళ నీవిటువంటి పని చేయు చున్నావేమో! లేక చేసియున్నావేమో! దాని విషయమై సంతాపము నొందుము. దాని ద్వారా దేవుడు నీకనుగ్రహిం చిన పరిచర్య పాడుచేయుచు, నిన్ను నీవే నశింపజేసుకొనుచు దేవుని పనినంతటిని నాశనము చేయుచున్నావు. అది నీకు కూడదు. ఇప్పుడే నీవు ఉపవాసముండి మోకరించి ప్రార్థన చేయుము. అందరితో సమాధానముగా నుండుము. దేవుడు నిన్ను ఆశీర్వదించును.

ఈ విషయము నేను ప్రార్థనలో పెట్టగా ప్రభువు స్వప్నమందు రెబెక్కాతో 'నా దాసుడైన నీ భర్తతో ప్రయాణము నకు సిద్ధపడుమని చెప్పుము. నేనాయనను హైదరాబాదులో నాటెదనని చెప్పుము' అని తెలియజేసెను. మరునాడు ఉదయం ఆమె ఈ విషయం నాకు తెలియజేసెను. నేను కొన్నాళ్ళీ విషయమై బాగా ఆలోచించి అధైర్యపడితిని. ఎందుకనగా నేను విద్యావంతుడను కాను, అనుభవము ఏ మాత్రము లేదు. దైవ వాక్యసంబంధమైన జ్ఞానము లేనివాడను. వాక్యోపదేశములో అందరికంటే కడపటి వాడను. ఒరిస్సా రాష్ట్రమునకు సమీపంలో పుట్టి పెరుగుట చేత ఆ వాతావరణ ప్రభావము వలన చక్కని భాష మాట్లాడుట చేతకానివాడను.

అంతేకాక అదొక నూతనమైన ప్రదేశము హైదరాబాదులో నాకు బంధువులుగాని స్నేహితులుగాని విశ్వాసులుగాని ఎవరూ తెలియరు. అదొక పెద్ద మహానగరము. నేను నా కుటుంబమును ఏ విధంగా అక్కడ జీవించగలము? నా కుమారుల విద్యా విషయము ఆ ప్రాంతములో సమస్య అయిపోతుంది. ఉండటానికి ఆశ్రయమేది? అనే మొదలైన అనేక ఆలోచనలతో కొన్ని నెలల వరకు ఏమి చేయాలో తోచక 'రెబెక్కా! నీవు బాగా జ్ఞాపకం తెచ్చుకో నీవు స్వప్నమందు విన్న స్వరము ఎలా వుంది? మరోసారి నాతో చెప్పు. ఎందుకంటే అపవాది కూడ వెలుగు దూతవలె వచ్చి మాట్లాడును అని వుంది. అంతేగాక యేసు ప్రభువు కూడ స్వయంగా మీరు పాములవలె వివేకులుగా యుండుడని వాక్యమందు హెచ్చరించు చున్నాడు. కాబట్టి మనము బహు జాగ్రత్తగా దానిని పరిశీలించాలి' అన్నాను.

అప్పుడు రెబెక్కా, 'ఏమండీ, మీకు నా దర్శనముపై అనుమానమా? లేక నేను చిన్నపిల్ల మాదిరిగా ఏవో పిచ్చి కలలుగని భ్రమపడి అది దేవుని దర్శనమని చెప్పానని మీ ఉద్దేశమా?' అనింది.

'అబ్బా! విషయాన్ని వాక్యానుసారంగా పరిశీలించాలని నేనేదో నిన్ను అడిగితే నీవు ప్రశ్నలతో నన్ను చిత్రవధ చేస్తున్నావు' అని అన్నాను. ఆమె మరలా నా వద్ద కూర్చుని జరిగిందంతా చెప్పింది. నేను నా మనసులో 'ఇప్పుడేమి వచ్చింది తొందర. మరోసారి ప్రభువు చెప్తాడులే. దావీదు మాత్రము రెండేసి, మూడేసి పర్యాయాలు దేవున్ని అడుగ లేదా? మనం అడిగితే తప్పేమి లేదు. నిదానంగా అడిగిందే మరోసారి దావీదువలె అడుగుతూ నిశ్చయం చేసుకొని ప్రయాణమవటం మంచిది' అనుకుంటూ వుండగా 'ఏవం డోయ్, ఏమిటా పరధ్యానం. అస్తమానం ఏదో ఒక అలోచనయేనా మీరు ఆలోచించి ఏమి చేయగలరు? అని రెబెక్కా అంది. 'ఇది ఆలోచనేమి కాదు. ప్రార్థన కొరకు గురి కలిగియుండుట. గురిలేనిదే కార్యం జరుగదు' అని అన్నాను.

ఇద్దరం మోకరించి 'పరమతండ్రీ! మేము అజ్ఞానులం, మూఢులము. నీ మాటలలోగల భావము అర్థం చేసుకొనుటకు నరుని జ్ఞానము ఏపాటిది? గనుక మరోసారి మీరే దయతో మాకు దర్శనములోగల భావము తెలియజేయండి' అని ప్రార్థిస్తున్నాము. ఒక సంవత్సరం వరకు మేము ప్రార్థించాము. అలా ప్రార్థిస్తున్నప్పుడే సంవత్సరమంతా ఆంధ్రరాష్ట్రంలోని ఆయా జిల్లాలలోని ఆయా పట్టణాలలో, పల్లెల్లో గొప్పగా ప్రఖ్యాతినొందిన దైవజనులతో కలసి పరిచర్యలో నన్ను వాడుకొనుచుండెను.

ఒకరోజు రాత్రి మేము 'ప్రభువా, హైదరాబాద్‌లో అన్ని శాఖలకు చెందిన పెద్దలైన ఘనులు, పండితులు, వేదాంతులు అనేకులున్నారు. అక్కడకు పోయి నేను చేయవలసిన పనియేమిటో నాకు అర్థం కావటంలేదు. వారికి మీరు ఒక మాటకు అర్థం చేప్తే వారు మరి పది అర్థాలు గ్రహించగల సమర్థులు. నేను మూర్ఖుడను. నేను ఎందుకు పనికొస్తాను? అక్కడ ప్రఖ్యాతిగాంచిన ప్రసంగీకు లున్నారు కదా! నేను అక్కడకు పోయి చేయవలసింది ఏముందో నాకర్థంకాకుండా వుంది. వారి పేరు వింటే చాలు వేలకొలది జనములు కూడు కుంటారు. నేను యాస భాష మాట్లాడువాడనని మీరెరుగరా? తండ్రీ, నాకు భయం వేస్తుంది. అవమానం పాలగుదునేమో' అని మొదలైన మాటలతో ప్రభువును ప్రార్థించాను. నాల్గవరోజు మధ్యాహ్నం రెబెక్కా 'ఏమండీ, ప్రార్థనలో కొంత సమయం గడుపుదాం రండి' అని పిలిచింది. 'నాకు బలహీనంగా వుంది. కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను' అని బదులిచ్చి వెంటనే 'క్షమించు ప్రభువా' అంటూ మేను వాల్చాను. ఆ నిద్రలో మూడు తెల్లని సింహాసనములు చూస్తున్నాను. ఎడమవైపు సింహాసనము ఖాళీగా వుంది. కుడివైపు సింహాసనంలో హిమమువలె తెల్లని వస్త్రములు ధరించిన ఒకాయన కూర్చుని వున్నాడు. మధ్య సింహాసనంలో మరొకాయన కూర్చునియున్నాడు. ఈయన కూడా తెల్లని వస్త్రములు ధరించి యున్నాడు. కుడివైపున వున్న వానికంటే ఈయన పెద్ద వయస్సుగలవానిలా కనిపించాడు. నేను నా చేతులు కట్టుకొని ఆ మూడు సింహాసనములకెదురుగా నిలబడి వున్నాను. మధ్యసింహాసనాశీనుడై యున్నవాని నోటనుండి గంభీరమైన స్వరము వినబడుచున్నది 'నీవు ప్రయాణమునకు సిద్ధము కమ్ము నేను నిన్ను హైదరాబాదు తీసుకొని వెళ్ళుదును. అచ్చట నేను నీకు తోడైయుందును' అని నన్ను ఆజ్ఞాపించి తెల్లని కాగితముపై ఎర్రని పెన్సిల్‌తో 1పేతు. 2:5-7 మరియు 7-11 వచనాలు అని వ్రాసి ఆ కాగితమును నా చేతికిచ్చి తన దక్షిణ హస్తము యొక్క చూపుడు వ్రేలు పైకెత్తి 'పోయి ప్రసంగించుము అని మరల ఆజ్ఞాపించెను. వెంటనే నేను లేచి ఆ విషయం రెబెక్కాకు చెప్పాను.

ధారావాహిక

# నిత్యజీవజలము

1

(పరిశుద్ధ గ్రంథంలోని కొన్ని సత్యాలను **"నిత్యజీవజలము"** అను ధారావాహిక ద్వారా అందించుటకు సంతోషిస్తున్నాం. పాఠకులు ప్రార్థనా పూర్వకంగా దీనిని చదివి ఆత్మీయ మేలులు, ఆశీర్వాదములు పొందవలెనని ఆశిస్తున్నాము).

ఐక్యరాజ్యసమితిలో నమోదు చేయబడిన 192 దేశాలలో మరియు తదితర దేశాలలోని సుమారు 700 కోట్లు వున్న ప్రపంచ జనాభాలో ఎన్నో మతములు వాటికి ఎన్నో మత గ్రంథములు వున్నవి. ఈ మత గ్రంథము లన్నిటిలో విరివిగా వాడబడుచున్న గ్రంథము బైబిలు. బైబిలు అను ఇంగ్లీషు పదము బిబ్లియోన్ అను గ్రీకు పదము నుండి వచ్చినది. బిబ్లియోన్ అనగా 'గ్రంథము' అని అర్థం. ఈ గ్రంథం (వాక్యము) చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమువలె వుండును. ఈ వాక్యము మనుష్యుల స్వంత ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని పరిశుద్ధాత్మ ప్రేరణ వలన ప్రేరేపించబడి పలుకబడిన వాక్యము. ఈ పలికిన మాటలు పరిశుద్ధుల ద్వారా వ్రాయబడి భద్రము చేయబడినవి (2పేతురు 1:19-21). 2తిమోతి 3:16లో పౌలు ఈ వాక్యము దైవావేశము వలన కలిగినదని చెప్పాడు. అందుకే దీనిని పరిశుద్ధ గ్రంథము అన్నాము.

ఇది దేవునిచే పలుకబడిన వాక్కు. ఆదికాండము మొదటి అధ్యాయము చూచినట్లైతే, దేవుడు పలుకగా ఆ ప్రకార మాయెను అన్న విషయం మనం గమనించగలము. ఆయనే వాక్యము అను విషయము యోహాను 1:1లో చూడగలం. ఆయనలో జీవము వుండెను. అనగా ఆయన వాక్యములో జీవముండెను. యోహాను 4:10లో యేసుక్రీస్తు వారు సమరయ స్త్రీతో పలికిన మాటలు గమనిస్తే ఆయన తనను తాను దేవుని వరముగా పరిచయం చేసుకున్నాడు. నీవు నన్ను ఎరిగి యుంటే, నీవు నన్ను అడిగినట్లయితే నీకు నేను జీవజలము ఇచ్చెదను అను విషయమును వారి సంభాషణలో మరియు 14లో 'నేను ఇచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగా వుండును' అని ఆమెతో చెప్పెను. ఆయనలో, ఆయన వాక్యములో జీవము, నిత్యజీవము వున్నది. అందుకే ఈ ధారావాహికకు నిత్యజీవజలము అను పేరు పెట్టబడినది.

ఈ పరిశుద్ధ గ్రంథము దేవుని ప్రణాళికను మానవుని పాప పరిస్థితిని వాని రక్షణ మార్గమును పరిశుద్ధుల ఆశీర్వాదమైన నిరీక్షణను తెలియపరచుచున్నది. ఇది దేవుని వాక్కు. ఈ వాక్కు ద్వారా తనను తాను ప్రజలకు ప్రత్యక్ష పరచుకున్నాడు. తన చిత్తమును బయలుపరచుచున్నాడు. సృష్టిపై సర్వాధికారము కలిగిన బలమైన వాక్కు (ఆది. 1వ అధ్యాయం, 2పేతు. 3:5,6). యెహోవా వాక్కు యథార్థమైనది (కీర్తన 33:4). ఆకాశము భూమి గతించిపోవునుగాని ఆయన మాటలు గతింపవు (మత్తయి 24:35). ఇది దేవునితో ప్రారంభింపబడి దేవునితో అంతమగుచున్నది. ఒక భక్తుడు ఈ పరిశుద్ధ గ్రంథమును 'ప్రయాణికుని పటము, యాత్రికుని దుడ్డుకర్ర, నావికుని చుక్కాని, సైనికుని ఖడ్గము, క్రైస్తవుని పతాకము' అని వర్ణించాడు.

ఈ పరిశుద్ధ గ్రంథము 66 పుస్తకాల కలయిక. పాత నిబంధన, క్రొత్త నిబంధన అను రెండు భాగములుగా విభజింపబడినది. పాత నిబంధన క్రీస్తు జననమునకు ముందు, క్రొత్త నిబంధన క్రీస్తు తర్వాత వ్రాయబడినవి. పాత నిబంధనలో 39 పుస్తకములు, క్రొత్త నిబంధనలో 27 పుస్తకములు వున్నాయి. చాలామంది ఈ పుస్తకముల సంఖ్యను జ్ఞాపకముంచుకొనుటకు కష్టపడుచూ వుంటారు.

దాదాపు 40 మంది దేవుని భక్తులు హెబ్రీ, కల్దీయుల భాష (కొన్ని చిన్న భాగములు), గ్రీకు, అరామిక్ (కొన్ని చిన్న భాగములు) అను నాలుగు వేర్వేరు భాషలలో 1600 సంవత్సరాల వేర్వేరు కాలములలో వ్రాసియున్నారు. ఈ విధంగా అనేక మంది వివిధ కాలాలలో, వివిధ పరిస్థితులలో వ్రాసినా ఒకే విషయంలో అనగా క్రీస్తు మానవాళికి కలుగజేసిన రక్షణను గూర్చి ఐక్యత కలిగి యున్నారు. గ్రంథ ఆరంభము మొదలుకొని గ్రంథ అంతము వరకు ఒకే విషయమును ప్రస్తావించుటలో దేవుని యొక్క ఆలోచన మిళితమై వుంది. పాత నిబంధన అంతటిలో పాప పరిహారమునకై దేవుని కుమారుని రాకను, క్రొత్త నిబంధనలో దేవుడు తానే శరీరధారిగా జన్మించి తన ప్రాణమును పెట్టి, పునరుత్థానుడై తిరిగి రానైయున్న క్రీస్తును

గూర్చి వ్రాయబడినది. పాత నిబంధన క్రీస్తు జన్మ ప్రవచనమైతే, క్రొత్త నిబంధన ప్రవచన నెరవేర్పు.

ఈ పాత నిబంధనలో మొదటి ఐదు పుస్తకాలైన ఆదికాండము నుండి ద్వితియోపదేశకాండము వరకు ధర్మశాస్త్రమనియు, యెహోషువ మొదలు నెహెమ్యా వరకు వున్న పన్నెండు పుస్తకములను చరిత్ర అనియు, యోబు నుండి పరమగీతముల వరకు వున్న ఐదు పుస్తకములను పద్య భాగములనియు, యెషయా నుండి దానియేలు వరకు వున్న ఐదు పుస్తకములను పెద్ద ప్రవక్తలనియు, హోషెయా నుండి మలాకీ వరకు వున్న పన్నెండు పుస్తకములను చిన్న ప్రవక్తలనియు పిలువబడినవి.

క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలో మొదటి నాలుగు పుస్తకములను అనగా మత్తయి నుండి యోహాను వరకు సువార్తలనియు, అపొస్తలుల కార్యముల గ్రంథమును ఆది సంఘ చరిత్ర అనియు, రోమా పత్రిక నుండి ఫిలేమోను వ్రాసిన పత్రిక వరకు వున్న పదమూడు పత్రికలను అపొస్తలుడైన పౌలు వ్రాసిన పత్రికలుగా మరియు హెబ్రీయులకు వ్రాసి పత్రికను కూడా పౌలు వ్రాసి పత్రికగా సంఘ చరిత్రకారుల అభిప్రాయము. యాకోబు వ్రాసిన పత్రిక మొదలు యూదా వ్రాసిన పత్రిక వరకు ఇతర భక్తుల పత్రికలు గాను, ఆఖరి పుస్తకమైన ప్రకటన గ్రంథమును ప్రవచన గ్రంథము లేదా దర్శన గ్రంథముగాను వర్ణించబడినవి.

ఆదిమ బైబిలు వ్రాత ప్రతులు ఏ ఒక్కటియు ఇప్పుడు లేవు. అవి మరుగున పడక మునుపే వాటిని ఆదిమ భక్తులు అతి జాగ్రత్తగా వాటిని 'ప్యాచ్చిమెంట్' అను జంతు చర్మముల మీదను, 'వెల్లుమ్' అను లేగ దూడల చర్మములపై, 'పాపిరస్' అను చెట్టు బెరడుతో తయారు చేయబడిన కాగితపు చుట్టలపై ఎత్తి వ్రాసిరి. వీటిని ఎంతో జాగ్రత్తగా కాపాడుకొనుచు తదుపరి జనాంగమునకు అందించియున్నారు. ఇలా ఎత్తి వ్రాయబడిన ప్రతులు క్రీస్తుకు పూర్వమే ఐగుప్తీయుల ఎడారులలో కనుగొనబడినవి. తర్వాత ఈ మధ్య కాలములో అనగా 1947లో యెరికో పట్టణమునకు 13 కిలోమీటర్ల దూరంలో వున్న 'ఖుమ్రాన్' గుహలలో యెషయా, హబక్కూకు గ్రంథములు, హోషెయా, మీకా, నహూము అలాగే మరికొన్ని పుస్తకములు హెబ్రీ భాషలో వ్రాయబడిన వ్యాఖ్యానములు దాదాపు 800 కాగితపు చుట్టలు కనుగొనబడినవి. వాటిని ఆధారము చేసుకొని ఇప్పుడు పరిశుద్ధ గ్రంథమును 1600 వేర్వేరు భాషలలోనికి తర్జుమా చేయబడినది. ఇంకనూ వేర్వేరు భాషలలోనికి తర్జుమాకై ప్రయత్నాలు జరుగుచున్నవి. అచ్చుయంత్రం ఐరోపా ఖండంలో కనుగొనక ముందు ఈ లేఖనములు అతి కష్టముగా చేతి వ్రాతలతో కొంచెం ప్రతులు వున్నాయి. ఒక పుస్తకమును ఎత్తి వ్రాయుటకు ఎంతో ప్రయాస, ఎంతో సమయం పట్టేది. అయితే ఇప్పుడు ఈ అచ్చు యంత్రము ద్వారా వేల సంఖ్యలో ముద్రించు చున్నారు. అప్పట్లో కొద్దిమంది వద్దనే ఈ బైబిలు గ్రంథము వుండేది. ఇప్పుడు అందరికీ అందుబాటులో వుంది.

రాజ్యాలు మారుతున్నాయి. వాటి సంస్కృతులు మారుతున్నాయి. దశాబ్దాలు గడిచే కొద్ది ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ పరిశుద్ధ గ్రంథం ఈ విధంగా భద్రపరచబడి అందరికీ అందుబాటులో వుండులాగున అన్ని భాషలలోకి తర్జుమా చేయబడింది. బైబిల్ వ్రాయబడుటకు దేవుడు తన బిడ్డలను ఏ విధంగా తన పరిశుద్ధాత్మచేత ప్రేరేపింపబడో, ఆ విధంగానే బైబిల్ భద్రపరచబడి, తర్జుమా చేయబడి ఒక తరము నుండి మరొక తరమునకు అందించాడు, అందిస్తున్నాడు.

ఈ బైబిలు ఇంగ్లీషు భాషకంటే ముందు ఆదిమ భాషలైన గ్రీకు, సిరియా, కోప్టిక్, గోతిక్, లాటిన్‌లలోకి తర్జుమా చేయబడింది.


## "హన్నాకృప"

### 9వ వార్షికోత్సవ పాఠకుల సదస్సు

**2008 సెప్టెంబర్ 13న ఒంగోలు క్లౌపేట, కృపాదానంవీధి, ది అన్‌డినామినేషనల్ చర్చ్ ఆఫ్ ది లార్డ్ ఆలయంలో జరుపబడును. కావున పాఠకులందరికీ మా హృదయపూర్వక ఆహ్వానము.**

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

మనము దేవునిచే స్వయంగా చేయబడినవారము. ఈ దేవుని కార్యము మనలను క్రీస్తుయేసునందు సృష్టించుట వలన జరిగినది (ఎఫెసీ.2:10). మనము నూతన సృష్టియై వున్నాము. మరొకమారు తెలుసుకొనండి ఇది దేవుడు చేసిన కార్యము. మన కన్నులకు ఆశ్చర్యమే! ఆశ్చర్యకరమైన ప్రేమ. ఈ ఆశ్చర్యకరమైన ప్రేమ అంటే అర్థం? ఈ రకమైన ప్రేమ మనకు అర్థంకాదన్నమాట. మనం ఎంతసేపటికి పాపము చేసినవాడు కఠినముగా శిక్షించబడాలి అనే కఠినమైన, క్రూరమైన స్వభావం గలవారము. దేవుడు పాపులకు, తనను నమ్ముట ద్వారా ఉచితంగా ఇచ్చిన నిత్యజీవమును మన క్రూరమైన స్వభావంవల్ల అర్థం చేసుకోలేక పాపులందరు నిత్యజీవమును పొందకూడదు అని వాదిస్తుంటాము. ఆ విధంగా పాపులందరు నిత్యజీవమును పోగొట్టుకుంటే అందులో మనం కూడా ఉన్నామన్న సంగతి మర్చిపోతాము. ఎంత పాపినైనా రక్షించడమే దేవుని ప్రేమ. అదే ఆశ్చర్యకరమైన ప్రేమ. తప్పులనుబట్టి శిక్షిస్తాడేగాని రక్షణను (నిత్యజీవమును) దూరం చేయడు (కీర్తన 89:30). ఇంత కష్టపడి సంపాదించుకున్న ఆత్మలను సైతానుడు దొంగిలించి తీసుకుని వెళ్తుంటే చూస్తూ ఊరుకునేటంతటి రోషములేని, చేతకానివాడు కాదు మన దేవుడు. మనము నూతనముగా సృష్టించబడిన తరువాత చేసే క్రియలు నిత్యజీవమును సంపాదించుకొనుటకు కాదు. ఎప్పుడైతే మనము క్రీస్తు యేసును రక్షకునిగా అంగీకరించి దేవుని అపారమైన ప్రేమలో, ఉచిత కృపలో (క్రియలను బట్టికాక) విశ్వాసమునుబట్టి రక్షణ పొంది వున్నామో మనము నిత్యజీవములో ప్రవేశించి వున్నామన్న మాట. నిత్యజీవము అనునది ఎల్లప్పుడు వుండునది అని అర్థము. పాపము చేస్తే పోయేది మరల పుణ్యము చేస్తే వచ్చేది కాదు! ఎందుకంటే అది క్రియల వలన కలిగినది కాదు! కనుక మనము రక్షించబడినాము అంటే నిత్యజీవములో ప్రవేశించామన్న మాట. నిత్యజీవము పొందిన తరువాత మనము చేసే క్రియలు నూతన సృష్టి సంబంధంగా చేసే క్రియలై వున్నాయి. ఉదాహరణకు మనిషిగా పుట్టిన తరువాత మనిషి మనిషిలాగే జీవిస్తూ వుంటాడు. కాని కొందరు అప్పుడప్పుడు కోతిలాగా, కుక్కలాగా మిమిక్రి చేస్తూ వుంటారు. అంతమాత్రం చేత వారు కోతిలాగా కుక్కలాగా అయిపోరు. అలాగే నూతన సృష్టిగా చేయబడిన మనము అప్పుడప్పుడు నూతన సృష్టిలోనే కొనసాగుతూ వుంటాము. కాని పనులు చేసినవారు దానికి తగిన ఫలము పొందుతారు కాని మరణములో నుంచి జీవములోనికి దాటిన మనము మరల మరణములోనికి రాము. రక్షింపబడిన తరువాత, చేయుటకు దేవుడు మన కొరకు సిద్ధపరచిన క్రియలు కొన్ని ఉన్నాయి (ఎఫెసి.2:10). కనుక క్రియలకు నిత్యజీవము సంపాదించుటకు ఎంతమాత్రము సంబంధం లేదు. క్రీస్తుయేసు సిలువ, మరణ, పునరుత్థాన ఆరోహణముల వలననే తప్ప రక్షణ పొందుటకు వేరే ఏ మార్గమును లేదు. అది దేవుని కృపలో ఉచితమే. విశ్వాసము ద్వారా క్రీస్తు యొక్క నీతి మనకు జమ చేయబడుతుంది. మన నీతి క్రియలన్నీ మురికి పేలికలు (యెషయా 64:6). కనుక ఈ మురికి మన రక్షణకు పనికిరాదు. క్రీస్తు యొక్క నీతియే దానముగా మనకు ఇవ్వబడినది. ఆయన నీతి వలననే మనము నీతిమంతులుగా తీర్చబడ్డాము. నీతిగల న్యాయాధి పతియగు దేవుడు దీనిని అంగీకరించాడు. మరొక రీతిగా దీనిని ఉదహరిస్తే నీవు ఎన్నటికీ తీర్చలేని ఋణమును వేరెవరో నీ తరుపున చెల్లించి నిన్ను ఋణ విముక్తుని గావించుట లాంటిది. ఇంకా దీనిని గురించి విశదముగా వివరించుటకు స్థలము చాలదు. ఈ క్రింద ఇయ్యబడిన వాక్యభాగములు చదువుకొనుట మీకు ప్రయోజనకరము.

1. ధర్మశాస్త్ర (ధర్మశాస్త్రము క్రియలకు సంబంధించిన) మూలమున ఏ నరుడును నీతిమంతుడని తీర్చబడడు (రక్షింపబడడు). కనుక రక్షణ పొందుటకై ధర్మశాస్త్రమునకు వేరుగా వేరొక నీతి కా(రా)వలసిన అవసరము ఏర్పడినది (రోమా. 3:19-21).

2. యేసుక్రీస్తునందు విశ్వాసము ద్వారా నమ్ము వారందరికి అది దేవుని నీతియైయున్నది. ఎందుకనగా అందరూ పాపముచేసి దేవుడు అనుగ్రహించిన మహిమను పొందలేకపోతున్నారు (రోమా.3:22-23).

3. క్రీస్తు సిలువలో చేసిన కార్యమునుబట్టి ఈ నీతి

వరముగా (దానముగా) విశ్వసించిన వారికి ప్రాప్తిస్తుంది (రోమా. 4:5,6,13; 5:17).

4. క్రీస్తులో మనలను వుంచుట అనే దేవుడు చేసిన ఈ కార్యము వలన క్రీస్తు మనకు నీతిగాచేయబడి వున్నాడు. అంటే మనము నీతిమంతులముగా తీర్చబడ్డాము.

పౌలు రోమా 10:3,4లో ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్ర సంబంధముగా జీవించి నీతిమత్వమును పొందుటకు వెదికారు కాని, దేవుని అంగీకారమైన నీతికి వారు లోబడలేదు. కనుక నీతిమంతులుగా తీర్చబడలేదు అని వ్రాయబడినది. క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై వున్నాడు. ప్రతి విశ్వాసికి నీతి నిమిత్తము క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై వున్నాడు. నీతిని పొందుటకు ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలతో పనిలేదు. ధర్మశాస్త్ర సంబంధమైన విధులన్నింటిని క్రీస్తు నెరవేర్చాడు (మత్తయి5:17). అయితే ఇప్పుడు విశ్వాసము ద్వారా క్రీస్తును మనకు నీతిగా పొందుచున్నాము. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలనుబట్టి మనుష్యుడు నీతిమంతుడుగా తీర్చబడడుగాని విశ్వాస మూలముగా నీతిమంతులుగా తీర్చబడుచున్నామని నమ్ముచున్నాము (గలతి. 2:16). ఎవరైనను క్రియల మూలముననే నిత్యజీవము పొందగలమని మొండిగా వాదించినట్లయితే క్రీస్తు ఈ లోకమునకు రావడము, చనిపోవడము, పునరుత్థానమవటము నిష్ప్రయోజనమే అని చెప్పుచున్నారన్న మాట. అసలు అలా బోధినిచేవారు వారి బోధ ప్రకారము వారు కూడా రక్షణ పొందలేరు. అసలు ఈ ప్రపంచంలో ఎవరూ రక్షణ పొందరు. అంతా కట్టకట్టుకుని నరకానికి వెళ్తారు. క్రీస్తు సిలువలో మరణించినది వ్యర్థమే! సాతానుడే గెలిచాడు అని బోధిస్తున్నారన్న మాట. ఈ విధమైన బోధ దేవుని దృష్టిలో ఘోరమైనది. ఎందుకనగా ఆయన తన మహాకృపలో అపారమైన ప్రేమలో మన రక్షణ కొరకు క్రీస్తు యేసులో సంపూర్తి చేసిన మహాయాగమును తృణీకరిస్తు న్నారు. పౌలు దీనికి 'భిన్నమైన సువార్త' అని పేరు పెట్టారు. అంతమాత్రమే కాక అటువంటి బోధ చేయువారు శాపగ్రస్తులు అని వ్రాశారు (గలతి. 1:6-9).

యోహాను 10:27-30 దయచేసి ఈ వచనాలు జాగ్రత్తగా చదవండి. ముఖ్యంగా 28వ వచనం. తానే మెస్సయ్య అని యేసు చెప్పిన మాటలను ఋజువు చేసిన ఆయన ఆశ్చర్యకార్యములను, నెరవేరిన లేఖన ప్రవచనాలను, యూదా మత నాయకులు తిరస్కరించారు. తానెవరో ఆయన స్పష్టంగా చెప్పాడు. అయితే వారు ఆయన మందలో చేరిన గొఱ్ఱెలు కారు, కనుక వారు నమ్మలేదు (24-25 వ). 27-30 వచనాలలో 'నేను నా గొఱ్ఱెలకు నిత్యజీవము ఇచ్చుచున్నాను' అని పలికాడు. 'ఇచ్చుచున్నాను' అనునది వర్తమానకాలము. రాబోవు కాలము కాదు. 28వ వచనంలో నేను వాటికి నిత్యజీవము ఇచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు అని నొక్కి వక్కాణించాడు. 'ఎన్నటికిని నశింపవు ఎవడును అపహరింపలేడు అన్న మాటలలోనే మన రక్షణ శాశ్వతముగా భద్రపరచబడి వున్నదని తేటతెల్లమైనది. యోహాను 5:24లో నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు అని యేసు చెప్పాడు. ఇక్కడ 'మరణము' అను పదమును గమనించాలి. ఇక్కడ చెప్పబడిన 'మరణము' ఆదిలో ఆదాముతో 'పండు తిను దినమున నీవు నిశ్చయముగా చత్తువు' అని దేవుడు పలికిన ఆ మరణము. ఆదాము ద్వారాను, ఆదాములో నుండి పుట్టిన మనకందరికి ప్రాప్తించిన 'ఆ మరణము' అని గ్రహించాలి (రోమా 5:12, 14:16, 1యోహా. 1:2). అది అంతములేని దేవునివలే ఈ జీవమునకు ఆది అంతములేదు. 'శాశ్వతము' 'నిత్యము' అను పదాలకు అర్థమేమంటే ఎల్లప్పుడు ఉండునది. ఇంకా చెప్పాలంటే నిత్యజీవము అంటే ఆ పేరులోనే నిత్యము వుండునది అని అర్థమవుతుంది. అంటే ఇకపోదు అని అర్థం. 'దాటియున్నాము' అనే పదము వర్తమానమును పొందిన స్థితిని తెలియజేస్తుంది. జీవములోనికి దాటియున్నాము అనగా ఆ జీవములో ఎల్లప్పుడు వుంటామని అర్థము. ఉదాహరణకు పదవ తరగతి పాసైన పిల్లలు ఇంటర్‌లో ప్రవేశిస్తారు. లేక పదవ క్లాసును దాటిన స్థితిలో వుంటారు. ఇక ముందు ముందు వారు చదివినా చదవకపోయినా పది దాటిన స్థితిలోనే వుంటారు. అంతేగాని మళ్ళీ పదిలోనికి రారు. ఒకవేళ మరల వాళ్ళు అదే చదవాలనుకున్న వాళ్ళ స్థితిమాత్రం మారదు. అలాగే మరణములో నుంచి జీవములోనికి దాటిన వారు కూడా జీవస్థితిలో నుండి మరణ స్థితిలోనికి రారు. క్రీస్తుయేసునందు విశ్వసించి రక్షింపబడినవారు ఆదాములో నున్న ఆత్మ సంబంధమైన మరణ స్థితిలో నుండి క్రీస్తులో వున్న నిత్యజీవములోనికి ప్రవేశించి యున్నామన్న సత్యమును గ్రహిస్తే సంతోషముతో ఎగిరిగంతులు వేయగలరు.

సీరియల్

# మహా యజ్ఞమ్

6

దేవుని పరిపూర్ణ మహత్త్వం క్రీస్తు భౌతికకాయంలో దాచబడి వుంది. క్రీస్తును అన్వేషించు వారికి ఆయన మహిమ వెల్లడి చేయబడుతుంది. ఒకనాడు యేసుక్రీస్తు ఒక కొండ మీద పేతురు, యాకోబు, యోహానుల ఎదుట రూపాంతరం పొందాడు. అప్పుడు ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను. ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను. మోషేయు, ఏలియాయు వారికి కనబడి, ఆయనతో మాట్లాడుచుండిరి. ఆయన ఇంకను మాట్లాడుచుండగా, ప్రకాశమానమైన ఒక మేఘము వారిని కమ్ముకొనెను. ఇదిగో 'ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేను ఆనందిచుచున్నాను. ఈయన మాట వినుడని' ఒక శబ్దము మేఘములో నుండి వినబడెను (మత్త. 17:5). ఈ కారణంగా పేతురు వ్రాసిన మాటలు చూద్దాం. చమత్కారంగా కన్పించిన కథలను అనుసరించి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదుగాని ఆయన మహోత్త్యమును మేము కన్నులారా చూచినవారమై తెలిపితిమి. 'ఈయన నా ప్రియ కుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నానని' ఒక మహా శబ్దము దివ్య మహిమ నుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన పొందగా, మేము అపరిశుద్ధ పర్వతం మీద ఆయనతో కూడ వుండినవారమై ఆ శబ్దం ఆకాశం నుండి రాగా వింటిమి (2పేతు. 1:16–18). ఈ సాక్ష్యాధారాలన్నీ పురుషోత్తముడు, క్రీస్తునాధుని గూర్చినవే.

## పరిత్యాగ నైవేద్యం

మహాయజ్ఞ పరిత్యాగ నైవేద్యం, ప్రజాపతి శ్రీయేసుక్రీస్తే. ఈ సత్యవాక్యాన్ని నిరూపించే, కొన్ని సంగతులను సమీక్షిద్దాం. త్యాగశీలాన్ని ప్రకటించే పదాలు రెండున్నాయి. అవి త్యాగం, పరిత్యాగం.

త్యాగం = సమర్పణ;

పరిత్యాగం = సమర్పణ.

త్యాగం, మానవ పరిమితమైన చర్యే. పరిత్యాగం, దేవాంకిత సర్వోత్తమ సమర్పణాకార్యం. త్యాగ చర్య వలన ఆనందం కలుగుతుంది. ఆనందంలో మూడు దశలున్నాయి. 1) ఆనందం 2) పూర్ణానందం 3) శాశ్వతానందం. ఈ త్రిదశానంద సంప్రాప్తమెలా?

'తేనత్యక్తేన భుంజీధాః' – 'త్యాగంతో ఆనందించు' అని ఈశావాస్యోపనిషత్, సలహా ఇస్తుంది.

ఒక సాధారణ పక్షి ప్రాణరక్షణకోసం శిబి చక్రవర్తి తన శరీరభాగాన్ని కోసి యిచ్చి, కీర్తిమంతుడై, ఆనందించాడు. దానమడిగిన ఇంద్రుడికి కర్ణుడు వీరోచితంగా తన సహజ కుండలాలు త్యాగంచేసి ఆనంద భరితుడయ్యాడు. ఇలా, త్యాగగుణంగల వారికి, అవతలి వారి అవసరమే ప్రధానం. త్యాగమంటే శిబి, కర్ణుడే కాదు, అనాదిగా అన్ని గుణాలకంటే త్యాగగుణం వలననే మనిషి మహనీయుడయ్యాడు. మానవీయుడయ్యాడు. త్యాగంలోని ఆ ఆనందాన్ని పొందిన వానికి, త్యాగమనేది ఇచ్చి పుచ్చుకొనే వ్యవహారంగానే వుంటుంది. త్యాగమనే దానికి వచ్చే ఫలితం ఆనందం అమృతోపమానం.

'త్యాగేనైకే అమృతత్వమానసుః' – అంటుంది కైవల్యోపనిషత్తు. 'త్యాగనైవేద్యం వల్ల అమృతం ప్రసాదంగా లభిస్తుంది' అని భావం.

'చిత్తా సత్తాపరం దుఃఖం చిత్త త్యాగః

పరం సుఖం' – అంటుంది అన్నపూర్ణోపనిషత్తు.

మనసనేదే దుఃఖకారణ్, ఆ దుఃఖ నివారణకు మనోత్యాగమే ఔషదం అని అర్ధం. కీర్తి, ధనం, సంతోషం, ప్రశంశ ఇవన్నీ ప్రాపంచకాంశాలు. లౌకిక లబ్ది పూరకాలు. త్యాగంవల్ల లభ్యమయ్యేవే.

పారమార్ధికమైన పరమసుఖం, శాశ్వతానందం సంగతేమిటి? ఆ పరమానందం ఏ త్యాగం వల్ల లభ్యమౌతుంది? పాపపరిహారం, పరిపూర్ణానందం, కేవలం పరమ పవిత్ర పరిత్యాగం వల్లనే లభిస్తాయి. పరిత్యాగం అంటే పరిపూర్ణ సమర్పణం అని ముందే విన్నాం. ఇహపరాలలో యుగ యుగాంతాల్లో సిలువ సంస్కారమనే పరిత్యాగాన్ని నెరవేర్చినది పురుషోత్తముడు యేసుక్రీస్తు ఒక్కడే. ఆ పరిత్యాగ ఫలితం దురిత పరిహారం నిరంతరం పరమానందం. పాపపుణ్యాల నడుమ పయనిస్తున్న, సకల లోక ప్రజానీకానికి, సంపూర్ణ సంరక్షణా పథం, శాశ్వతంగా స్థాపింపబడింది. ఇదే సిలువ మహాయజ్ఞ పరిత్యాగ నైవేద్య ఫలం.

## పురుష మహాయజ్ఞం

మహా దివ్య మహిమాన్వితా మానవుడు, పరిపూర్ణమైన యజ్ఞార్పణగా అర్పింపబడినాడు. ఆయన సర్వశక్తిమంతుడు. బలీయమైన దేవుడైనప్పటికీ, ఆయన యజ్ఞార్పణ జంతువుగా పరిగణింపబడి అర్పింపబడినాడు. మరోవిధంగా తెల్పితే, తాంధ్య మహాబ్రాహ్మణలో తెలుపబడిన విధంగా, ఆయన తనను తానే యాగార్పణగా అర్పించుకున్నాడు. (ఆయన స్వపరిత్యాగ చర్యచేత ప్రజాపతి తనను తానే అర్పించు కొనెను అని వుంది). ఇదే పురుషసూక్త యొక్క ప్రధాన వుద్దేశం. ఈ క్రింది శ్లోకాలు చూద్దాం.

'యత్ పురుషెన హవిసాదెవా
యజ్ఞా మతన్వత
వసంతా అస్య ఆసిదాజ్యం
గ్రీస్మ ఇదమ హసరద్దావై.
తమ్ యగ్నమ్ బ్హసి
ప్రౌక్సన్ పురుషమ్ జాతమగ్రహత్
తె దేవా అయజంత
సాధ్యార్సయస్కయె'

భావం : దేవతలు, పురుషను, యజ్ఞ నైవేద్యంగా అర్పించే టప్పుడు, వసంత ఋతువు, కరిగిన వెన్నలా, వేసవి, దాని ఇంధనంగా, ఆకురాలు కాలం (మార్గశిర్ష) దాని నైవేద్యంగా పనిచేశాయి. ఆరంభంలో ఎండుగడ్డిపై జన్మించి, పవళించిన పురుషపై అవి చిలకరింపబడినాయి. దేవతలు, సాధువులు, దీర్ఘదర్శులు ఆయనను బలిగా అర్పించారు.

పురుష, యజ్ఞార్పిత నైవేద్యమయ్యాడు. దీర్ఘదర్శులు, దేవతలు యజ్ఞార్చకులుగా వుండేవారు. ఈ ప్రధాన అభి ప్రాయం, ఈ వచనాల్లో చాల తేటగా వుంది. ఎండిన తుంగపై దీపింపబడిన యజ్ఞం. ఆదిలో జన్మించిన ఆ మానవుడే ఆయన వలననే దేవతలు, తదుపరి దీర్ఘదర్శులు, పరిశుద్ధులు యజ్ఞం చేసేవారు.

## యజ్ఞ ప్రాథమిక ప్రయోజనం

పురుష సూక్తలోని 'తస్మాద్ యజ్ఞాత్ సర్వహుః' అనే శ్లోకం యజ్ఞం ఒక సంపూర్ణ సమర్పణం అని స్పష్టీకరిస్తుంది. పురుష సూక్తలోని శ్లోకాల భావానుసారం సంక్షిప్తంగా ఈ విశ్వమంతా పురుష యొక్క బల్యర్పణచే సృజింపబడినదని అర్థమవుతుంది. ఈ సంధర్భంలో

'తస్మాద్ విరాల జాయత
విరాజో అధి పూరుషః
సజాతో అత్యరిశ్యత
పస్కా ద్భూమి మధో పురః'

భావం : 'ఆ పురుష యొక్క ఒక భాగం నుండి (విరాజ్) విశ్వం ఉద్భవమైంది అది పురుష యొక్క పీఠంగా చేయబడింది. ఆయన సర్వాంతర్యామి అయ్యాడు'

పురుష సూక్తలోని మొదటి ఐదు వచనాలు పురుష యొక్క మహత్త్వాన్ని తెల్పుతున్నాయి. ఈ ప్రపంచంలో సష్టింప బడినవన్నీ పురుష చేతనే కలిగించబడినాయి. సకల భూమిని ఆయన సముఖంతో నింపి, సింహాసనాసీనుడై యున్నాడు. అందువలన ఆయన 'విరాట్ పురుష' అని పేరుగాంచాడు. విశ్వంలోని గ్రహాలన్నీ పురుషయజ్ఞం వలననే ఏర్పరచబడినవని శ్లోకం వుంది.

'చంద్రమా, మనసొజాత
చక్షిః సూర్యో అజాయత ముఖాదింద్ర స్కగ్నీస్క
ప్రాణాద్ వాయు రజాయత'

భావం : ఆయన మనస్సు నుండి చంద్రుడు జనించాడు. ఆయన నేత్రం నుండి భానుడు ఉద్భవించాడు. (ఇంద్ర) మెరుపు, వర్షం, అగ్ని ఆయన నోటి నుండి వెలువడ్డాయి. ఆయన శ్వాస నుండి వాయువు ఉత్పన్నమైంది.

ఈ విధంగా పురుష ద్వారా సమస్తం కలిగింది. పరిశుద్ధ యోహాను యేసును గురించి ఈ మాటలే వ్రాశాడు. 'సమస్తము యేసు మూలముగ కలిగెను. కలిగియున్న దేదియూ యేసు లేకుండా కలుగలేదు (యోహా. 1:3) పరిశుద్ధ పౌలు రోమీయులకు వ్రాసిన మాటలు 'క్రీస్తు మూలమున, క్రీస్తు ద్వారా, క్రీస్తు కొరకై సమస్తమూ కలిగియున్నవి. యుగముల పర్యంతం, క్రీస్తుకే మహిమ కలుగును గాక (రోమా. 11:36). ఇలాగే, హెబ్రీ పత్రికలో క్రీస్తు మహత్యం వక్కాణింపబడింది. భూమి పునాదులను ఏర్పరచిన ప్రభువు యేసేనని వ్రాయబడింది. క్రింది వచనాలు చూద్దాం. 'దేవుడు తన తొలి సంతానమైన ఆది సంభూతిని, భూలోకమునకు మరల రప్పించినపుడు, దేవుని దూతలందరూ ఆయనకు నమస్కారము చేయవలెనని' చెప్పుచున్నాడు (హెబ్రి. 1:6). దేవుడు తన కుమారుని గూర్చి 'దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది (హెబ్రి. 1:8). మరియు దేవుడు 'ఓ ప్రభువా! ఆదియందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడా నీ చేతి పనులే. అవి నశించునుగాని, నీవు నిలిచియుందువు (హెబ్రి. 1:10,11).

సీరియల్

5

# అత్యంత ప్రియమైన అమ్మ

## (దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)

**1. సౌందర్యంపై దేవుని దృక్పథం గ్రహించుట :**

ప్రస్తుతకాలంలో స్త్రీలు బాహ్యాలంకరణ మోజులో వున్నారు. కొందరికైతే యిది కాలక్రమేణా మానసికంగానూ మరియు భౌతికంగాను విషాదంగా మారుతూ వుంది. మా తల్లి సర్వసామాన్యమైన వ్యక్తి. దేవుని దృక్పథం ప్రకారమే తన సౌందర్యాన్ని అంచనా వేసుకునే అలవాటు ఆమెకు అలవడింది. ఒక వ్యక్తి ఏ విధంగా వస్త్రాలు ధరించాడు లేక ఆ వ్యక్తి ఏ విధంగా అలంకరించుకుంది అని ఆమె ఎన్నడూ గమనించేది కాదు. యేసుక్రీస్తు యొక్క పరిశుద్ధతను ధరించుకున్న ప్రజలతో కలసి వుండుటకు ఆమె సంతోషించేది. మా తల్లి తన అంతరంగ సౌందర్యమును 1పేతురు 3:4 వాక్య ప్రకారం అభ్యాసం చేసింది. 'సాధువైనట్టియు, మృదువైనట్టియు గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగా స్వభావము మీకు అలంకారముగా వుండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువగలది'. అది దేవుని లక్షణం. 1తిమోతి 2:9,10లో చెప్పబడిన పౌలు మాటలను కూడ మా తల్లి అనుసరించింది. 'మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారైయుండి, తగుమాత్రపు వస్త్రముల చేతనేగాని జడలతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్క్రియలచేత తమ్మును తాము అలంకరించుకొనలెను'.

**2. దేవుని స్వభావము ప్రతిబింబింపజేయుట :**

మా తల్లి దేవునియందు భయభక్తులతో జీవించింది. క్రైస్తవ సమాజంలో చాలమంచి గౌరవం సంపాదించుకుంది. సంఘంలో అనేకులకు ఆమె సహాయం చేసింది. సంఘ కాపరి రెవ. సొలొమోను సహితం ఆమె గురించి 'వాడబారని పుష్పం' అను పుస్తకం వ్రాశారు. ఆ పుస్తకంలో విభిన్న ప్రజల అభిప్రాయాలు, అనుభవాలు సేకరించి ముద్రించారు. ఇది ఒక మంచి పుస్తకం. ఆమె గుణలక్షణాలన్నీ ప్రస్తావించి పుస్తకం అది.

ఆమె అపొస్తలుడైన పౌలు వ్రాసిన దేవుని మాటలకు విధేయత చూపింది. 'అన్నిటియందు నిన్ను నీవే సత్కార్యముల విషయమై మాదిరిగా కనుపరచుకొనుము' తీతుకు 2:8. 'మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా వుండుము' 1 తిమోతి 4:12. ఆవిధంగా మా తల్లి దేవుని లక్షణాలన్నీ ప్రతిబింబింపజేసింది.

కేంబ్రిడ్జ్ క్రికెట్ ఆటగాడు సి.టి స్టడ్ ఈ విధంగా చెప్పాడు. 'ఒకే ఒక జీవితం, అది త్వరలోనే గతించిపోతుంది. జీవితంలో క్రీస్తు కొరకు చేసిందే నిలుస్తుంది. యేసు కొరకు నీ జీవితం సమర్పించినప్పుడు నీవేమీ నష్టపోవు. నీ స్వార్థం నిమిత్తం నీవు జీవించినట్లయితే నీవేమీ సంపాదించుకోలేవు'

**3. సమాధానపరచువారిగా వుండుట :**

తగాదాలు పరిష్కరించుటలో ఆమె చొరవ తీసుకొని వాటిని పరిష్కరించేది. అందువలన ఆమె సమాధానపరచే వ్యక్తిగా పరిగణించబడింది. మనస్పర్థల విషయాన్ని దేవుడే చూసుకుంటాడని ఆమె ఎల్లప్పుడు విశ్వసించేది. ఆమె ఎన్నడూ ఎవరితోను తగాదా పెట్టుకోలేదు. ఆమె ఎన్నడూ వ్యర్థమైన సంభాషణకు తావివ్వలేదు లేక ఇతరుల జీవితాల మీద బురద చల్లలేదు. ఆమె ప్రజల వ్యక్తిగత సమస్యలు శ్రద్ధగా వినేది. వాటిని ఇతరులకు ప్రచారం చేసేది కాదు. వారి గురించి ఆసక్తితో ప్రార్థన చేసేది. ఇది సమాధానకర్త యొక్క ప్రధాన గుణలక్షణం.

'సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు' మత్తయి 5:9. సమాధానకర్తయగు అధిపతి యేసు నాయకత్వంలో హృదయాలలో, మనసులలో, ఆత్మలలో శాంతి స్థాపించుటకు ఆయన సహవాసంలో చేరండి. యాకోబు 1:19లో వ్రాసిన విధంగా ఆమె ప్రవర్తన వుండేది. 'నా ప్రియ సహోదరులారా, మీరీ సంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను'.

**4. దైవభక్తిని ఇతరులతో పంచుకొనుట :**

అవకాశం వచ్చినప్పుడెల్లా మా తల్లి దేవుని గురించి మాట్లాడేది. తన ప్రవర్తన ద్వారా దైవభక్తిని చూపేది. ఏది

మంచిదో దానిని ఆమె ఎల్లప్పుడు చెప్పేది, ఆచరించేది. స్థానిక సంఘ స్త్రీల సహవాసానికి నాయకత్వం వహించేది, ఎల్లప్పుడు దేవుని వాక్యం ప్రకటించుటకు యిష్టపడేది. ఆమె గృహంలో స్త్రీల కూడిక ఏర్పాటు చేయుటకు ఆసక్తి చూపేది. క్రైస్తవులైనా, క్రైస్తవులు కాకపోయినా ఎవ్వరితోను వాదన పెట్టుకునేది కాదు. తన దగ్గరకు వచ్చిన ప్రజలు చెప్పే విషయాలు ఎంతో శాంతంగా వినేది. ఆమె దగ్గరకు ఎవరైనా నిరభ్యంతరంగా వెళ్ళుటకు అవకాశం వుండేది.

మా తల్లి తన సమాజంలో అభిషేకించబడిన నాయకురాలు. దేవుని యెడల ఆమెకున్న విశ్వాసంచేతను, పరిశుద్ధాత్మపూర్ణురాలైన చేతను ఆమెకు నాయకత్వ లక్షణాలు అలవడినాయి. 1995వ సంవత్సరంలో స్త్రీ పంచాయితీ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా గెలుపొంది పులివెందులలో ఆమె చరిత్ర సృష్టించింది. గ్రామంలో రహదారులు బాగు చేయించింది, కుళాయి నీటి వసతులు ఏర్పాటు చేయించింది. గ్రామంలో ఆమె జరిగించిన అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుండి అవార్డులు అందుకుంది.

ఆమె మహిళా మండలి అధ్యక్షురాలిగా పేద స్త్రీల జీవనోపాధిలో సహాయపడింది. లయన్స్ క్లబ్ స్త్రీల విభాగాన్ని కూడ ఆమె ప్రారంభించి దానికి 'ప్రియదర్శిని' అని పేరు పెట్టింది. ఆ క్లబ్‌కు అధ్యక్షురాలిగా సేవ చేసింది ఆమె అనేక వైద్య శిబిరాలు, ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు నిర్వహించింది. ఎంతోమంది రోగులకు శస్త్రచికిత్సలు చేయించింది.

పేద ప్రజలు వివాహాలు చేసుకునేటప్పుడు ఆమె వారికి ఆర్థికంగా సహాయం చేసేది. వారికి ఆహారం, వసతి, వైద్య సహాయం చేసేది. 2003వ సంవత్సరంలో కడప జిల్లాలో భయంకరమైన కరవు సంభవించినప్పుడు, 45 రోజులు ఆకలిగొన్న ప్రజలనేకులకు ఆకలి తీర్చింది.

**5. తన భర్తను ప్రేమించుట :**

మా అమ్మ చాలా మంచి భార్య. తన భర్తను సౌఖ్యంగా వుంచాలని శాయశక్తులా ఎంతో ప్రయత్నించింది. ఆయన అనేక పనులతో తీరక లేకుండ వుండేవారు కాబట్టి ఆయన గురించి ఎంతో ప్రార్థన చేసేది. కొన్నిసార్లు మా తండ్రి అపాయకర పరిస్థితుల్లో వుండేవారు. ఆయన చెడ్డవారిని ఎదిరించి సమాజంలో న్యాయం జరగాలని పోరాడేవారు. మన ఐశ్వర్యం మరియు మన క్షేమం మీ అమ్మ ప్రార్థనల మీద ఆధారపడి వున్నాయని మా తండ్రి ఎల్లప్పుడూ చెప్తు వుండేవాడు. 1పేతు.3:1,2లో అపొస్తలుడైన పేతురు ఈ విధంగా సెలవిచ్చాడు. 'అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి. అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్టవచ్చును'.

మా తల్లి బైబిలును అనుసరించింది. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ వుంటుందనే సామెత వుంది. మా తండ్రి సాధించిన ప్రతి విజయం వెనుక మా అమ్మ పాత్ర వుంది. ఆమె మమ్ములందర్నీ పెంచి పెద్ద చేసింది, కుటుంబ సభ్యులందరి బాగోగులు చూసుకుంది. ఆ విధంగా మా తండ్రి బరువు బాధ్యతలు తేలిక చేసింది. కుటుంబ సభ్యుల బాధ్యత, బంధువుల బాధ్యత ఆమె భుజాన వేసుకొని మా తండ్రి మానసిక వత్తిడిని తగ్గించేది. ఆమె ప్రేమ స్వభావం 1కొరింథీ.13:4-7లో చెప్పిన విధంగానే వుండేది. 'ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో వుంచుకొనదు. దుర్నీతి విషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును'.

**6. తన పిల్లలను ప్రేమించుట :**

మా అమ్మ ఎంతో బాధ్యత, ప్రేమగల తల్లి. ఆమె జీవితమంతా తన పిల్లలకు ప్రేమతో సేవ చేయడంతోనే గడిపింది. ఆమె పిల్లల బాగోగుల గురించి ఎల్లప్పుడు ప్రార్థిస్తూనే వుండేది. 'కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే' కీర్తన 127:3 అని బైబిలు స్పష్టంగా బోధిస్తూ వుంది. ఆమె మమ్ములను దేవుడిచ్చిన బహుమానంగా భావించి చాలా జాగ్రత్తగా పెంచింది. మేమంతా దేవుని మార్గంలో వుండాలని తాను శాయశక్తులా కృషిచేసింది. ఆమె మాకందరికీ జీవిత నైతిక విలువలను నేర్పించి, మంచి పౌరులుగా తీర్చిదిద్దింది.

(సశేషం)

# మదర్ తెరీసా

26 ఆగష్టు 2008 మదర్ తెరీసా 98వ జన్మదినము. యేసుప్రభువు ప్రేమను లోకానికి చాటిన మదర్ తెరీసా జన్మదినాన్ని జ్ఞాపకము చేసుకొనుట మనందరికి మేలుకరము. 'నేను దప్పిగొనియున్నాను' అని యేసుప్రభువు సిలువపై పలికిన ఐదవ మాట మదర్ తెరీసాకు ఎంతో ఇష్టమైన మాట. సిలువ మీద మరణించే సమయంలో యేసుప్రభువు ఏడు మాటలు పలికారు. గుడ్‌ఫ్రైడేనాడు ప్రంచంలో వున్న క్రైస్తవ సంఘాలన్నీ ఈ ఏడుమాటల మీద ధ్యాన్యనం చేస్తూ, ఆ సిలువ వెలుగులో తమ జీవితాలను పరీక్షించుకుంటాయి. ఆనాడు క్రైస్తవులంతా దేవాయాలకు వెళ్ళి ఆ మాటల్లో నిబిడీకృతమైన పరమార్ధాన్ని పరిగ్రహించి దాన్ని తమ జీవితాలకు సమన్వయం చేసు కోవాలని ధ్యానం చేస్తారు. పాపములో జీవించుచున్న జనులను, ప్రయాసలో జీవించుచున్న వారిని పాపము యొక్క శక్తి నుండి విడిపించాలని పాపికి బదులుగా సిలువలో నరకయాతన పడుచు పాపకూపములో పడియున్న వారిని విమోచించుటకు దాహముగొనెను. నశించుపోవుచున్న ఆత్మలపట్ల ప్రభువుకున్న వేదన ఈ మాటల్లో వున్నట్లు మదర్ తెరీసా గుర్తించారు. కల్వరి సిలువపై మానవాళి యెడల దేవుని ప్రేమ ఆచరణలో ప్రదర్శించబడినది. యేసుప్రభువు ఆ సిలువపై వ్రేలాడుతూ పడిన శ్రమ, తలపై ముళ్ళకిరీటం, చేతులు కాళ్లు మేకులతో కొట్టిన వైనం ఆయన శరీరమంతా రక్తమయమై గుర్తుపట్టలేనంతగా ఆయన ముఖము, ఇదంతా మన రక్షణ కొరకు ఆయన పొందిన సిలువ త్యాగము. మన జీవితంలో ఆ దేవుని ప్రేమను లోకానికి ఆచరణలో చూపగలుగుతున్నామా? మీరు మిమ్మును ప్రేమించు వారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును? (మత్తయి 5:46). ప్రతి వ్యక్తి యెడల దేవునికి ఒక నిర్దిష్ట ప్రణాళిక వుంది. ప్రతి మనిషి దేవుడిని అన్వేషిస్తున్న ప్రత్యేక సృష్టి. మనవలె ప్రతి ఒక్కరు ఈ భూమిపై సంచరించేటువంటి కొద్దికాల యాత్రికులము అనుకోవాలి. ధనవంతులైనా, పేదవారైనా, నల్లవారైనా, తెల్లవారైనా, వృద్ధులైనా, యువకులైనా, పురుషులైనా, స్త్రీలైనా ఎవరైనా సరే మన ప్రేమ ప్రతి ఒక్కరిపై వుండాలి. అది "అగాపే ప్రేమ". మనము ఏ విధంగానైతే దేవుని ప్రేమను పొందుచున్నామో అదేవిధంగా మనం దేవుని ప్రేమను ఇతరులకు విస్తరింప జేసే వారిగా వుండాలని దేవుడు కోరుచున్నాడు. మన పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మనమును పరిపూర్ణులుగా వుంటూ మన ప్రేమను అందరికీ పంచేటట్లు జీవించాలి. యేసుప్రభువు ప్రేమను ఆచరణలో చూపడమే మదర్ తెరీసా జీవిత ధ్యేయం.

పేదరికంలో మగ్గుతున్న పిల్లలతో గడుపుట మదర్ తెరీసాకు అవధులు లేని ఆనందన్నిచ్చాయి. ఆ పిల్లల్లో జాలి, దయ వుండుట మదర్ గ్రహించింది. ఒకరోజు ఒక అన్నా, చెల్లి నిన్న ఉదయం నుండి తినకుండా వున్నారని ఒక చిన్న పాప మదర్ తెరీసా చెవిన వేసింది. ఆ పిల్లలిద్దరూ మదర్ తెరీసాకు చెప్పుటకు సిగ్గుపడుతున్నారు. వెంటనే స్కూలు ఆపేసి మదర్ తెరీసా వారికి భోజన ఏర్పాట్లు చేయుటకు పరుగెత్తింది. అది చూచి పిల్లలంతా ఆశ్చర్యపోయారు. పిల్లలే కాదు అక్కడున్న ప్రతి ఒక్కరూ ఆమె చేస్తున్న పనులు చూచి ఆశ్చర్యపోతున్నారు. తన బడికి వచ్చే పిల్లలందరికీ మదర్ తెరీసా మధ్యాహ్నం పూట పిల్లవానికో గ్లాసుడుపాలు ఇప్పించే ఏర్పాటు చేసింది. భారతదేశంలోని ప్రజానీకంలో మదర్ తెరీసాకు అవినాభావ సంబంధం ఏర్పడింది. నిరుపేదల నిట్టూర్పులు ఆమెలో అనురాగాన్ని పెంచాయి. పసిపాపల ఆకలి బాధలు ఆమెలో ఆత్మీయతను పెంచాయి. కుష్టురోగులు అనుభవించే నికృష్టమైన జీవితాలు ఆమెలో కనికరాన్ని పెంచాయి. దిక్కూ మొక్కు లేకుండా చనిపోయే అభాగ్యుల స్థితిగతులు ఆమెలో దయను పెంచాయి. అందుకు మదర్ తెరీసా 1950లో భారత దేశ పౌరసత్వాన్ని పొంది, భారతీయు రాలిగా మారింది. పేద ప్రజల ఓదార్పుకు, వారి సేవలకు తన జీవితాన్ని అంకితం చేసుకుంది. దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించింది. తనను ఎన్నుకొని తన ద్వారా ప్రభువు పనిని చేయుటకు దేవుని చిత్తమైనందుకు ఎంతో సంతోషించింది. మోలేజిల్‌లో నాటిన విత్తనం ప్రపంచమంతా వ్యాపిస్తుందని మదర్ ఊహించి వుండదు.

1949 జనవరి 4న ముగ్గురు టీచర్స్ మదర్ తెరీసాకు సహాయముగా స్కూలులో బోధించుటకు వచ్చారు. 14వ తేదీన బయట వున్న స్కూలును ఒక రూములోనికి మార్చారు. వర్షం బాధ తప్పింది. ఆ ప్రాంతాల్లో వున్న ప్రజలు మదర్ చేస్తున్న మంచి పనులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పిల్లల

సంఖ్య అయిస్కాంతానికి అంటుకున్నట్లు పెరుగుతూ వుంది. అదే సమయంలో సిస్టర్ రొజారియో డిస్పెన్సరీ మొదలు పెడదామని సలహా ఇచ్చింది. దానికి రూము కావాలి కదా అన్నప్పుడు. స్కూలు గదిని స్కూలు సమయం తరువాత డిస్పెన్సరీగా వాడుకొన వచ్చని సలహా ఇచ్చింది. వెంటనే పేదలకు డిస్పెన్సరీ మొదలైంది. బారులు తీరిన జనం వైద్యం కొరకు వస్తున్నారు. రోగులలో ఎవరైనా క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారా అని మదర్ తెరీసా పరీక్షించేవారు. మందులు బిక్షమెత్తుకొని తెచ్చి, ఉచితంగా ఇచ్చేవారు. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, డయేరియా మొదలగు లేబుల్స్‌తో మందుల్ని చిన్న చిన్న పొట్లాలు కట్టి ఇచ్చేవారు. మదర్ తెరీసా తనకంటూ ఒక రూము దొరికితే దానిలో ఉంటూ తన సేవ కొనసాగించాలని రూము కొరకు ప్రయత్నిస్తుండేది. ఒక రోజంతా తిరిగి తిరిగి పేదరికంలోని బాధను అనుభవించి ఒక జర్నల్‌లో ఈ విధంగా వ్రాసింది 'కొందరు నేను చేస్తున్న పనికి ఏమి ఉపయోగముందని అనుకుంటున్నారు. చాలా మంది నన్ను స్లమ్ సిస్టర్ అని పిలుస్తున్నారు. నా దగ్గర డబ్బు లేకపోయినా, ప్రేమ, అంకిత భావం ఉన్నాయి కనుక వీటినే నిరుపేదలకు పంచుట ద్వారా ఆ దేవునికి మహిమ వస్తుందని సంతోషిస్తాను' అని వ్రాసింది. ఫిబ్రవరి 1949లో ఇంకో జర్నల్లో 'దేవుని చిత్తానుసారము పేదరికంతో కూడిన సిలువతో కప్పబడిన సేవను చేయడానికి నా యిష్టపూర్తితో వచ్చాను. కానీ ఈ రోజు క్రొత్తపాఠాన్ని నేర్చుకున్నాను. పేదవారి పేదరికం ఎంత కఠినంగా ఉంటుందో తెలుసు కున్నాను. నా కొరకు ఒక ఇల్లు అద్దెకు కావాలని ఊరంతా తిరిగి వెదకి నడిచి నడిచి నా కాళ్ళు చేతులూ నొప్పులు పుట్టేలా తిరిగాను. పేదవారు కూడా వారికి కావలసిన ఇల్లు, కూడు సహాయం కొరకు వారి శరీరం, మనసు ఎంత బాధకు, ఎంత క్షోభకు గురయ్యేవో తెలుసుకున్నాను. అప్పుడు నా మదిలో లోరిటో స్కూల్లోని రాజభవనాలు, వసతులు గుర్తుకు వచ్చాయి. ఒక్కమాట చెప్తే సర్వభోగాలు మళ్ళీ నా వద్దకు వస్తాయి. అపవాది మనసులో దూరు తున్నాడు. నాదేవా, నా అంతట నేను నీపై వున్న ప్రేమతో తీసుకున్న నిర్ణయం. నీ పరిశుద్ధ చిత్తమేమై వున్నదో, అదే నేను కోరుకునేది. ఇంతకంటే ఎక్కువ కష్టాలు వచ్చినా, ఒక్క కన్నీటి బొట్టు రాలకుండా నీ చిత్తాన్ని నెరవేర్చడానికి ఒప్పుకుంటున్నాను. నా దేవా! నీవే నా బలము, నాకు ధైర్యమిచ్చే నీ చిత్తము నెరవేర్చుటకు సహాయము దయచేయుము' అని వ్రాసింది. జర్నల్లో ప్రచురమైన తర్వాత ఫాదర్ వాన్ఎగ్జిమె చదివి మదర్ తెరీసాతో క్రీక్‌లేన్‌లో 14 నవంబర్‌లో పాతభవనంలో ఒక గదిని నీ కొరకు చూశా నన్నాడు. మదర్ నా వద్ద అంత డబ్బు లేదు గదా అన్నారు. అది నీకు ఉచితంగా మైఖేల్ గోమ్స్‌గారు ఇవ్వడానికి ఒప్పుకున్నారని చెప్పారు. మైఖేల్‌గోమ్స్ ఉదార స్వభావుడు. అతని దగ్గరకు ఒకసారి ఫాదర్ వాన్ ఎగ్జిమ్ వెళ్ళి మదర్ తెరీసా సంగతి చెప్పి ఏదైనా ఒక చిన్న గదిని ఇప్పించమని అర్థించారు. అతను తటపాయిస్తుంటే తన ఎనిమిదేళ్ళ కూతురు మాబెల్ తడుముకోకుండా జవాబిచ్చింది. మన మేడ గది ఖాళీగా వుంది, మదర్ దానిలోకి రావచ్చు అంది. ఎంత ఆశ్చర్యం. 'తండ్రీ, ఆకాశమునకు భూమికిని ప్రభువా నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను' (లూకా 10:21). ప్రభువు చెప్పిన మాటల్లో నిస్సందేహముగా నిజమున్నది గదా. ఒక అందమైన, ఆనందమయమైన ఇంటిలో ఉచిత నివాసము ఏర్పాటయింది.




# విశ్వాసంలో ఓ మెట్టు



1981లో కంభం గవర్నమెంటు లెప్రసి కంట్రోలు యూనిట్‌లో డా॥ హుస్సేనయ్యగారి దగ్గర డ్రైవరుగా పని చేసినప్పుడు తను ఉద్యోగం చేస్తున్నట్లుగా ఎన్నడూ భావించ లేదు. ఎందుకంటే హుస్సేనయ్యగారు, ఆయన కుటుంబ సభ్యులు సామ్యేలును వారి కుటుంబ సభ్యునిగా భావించారు.

1965 నుండి సొంత కార్లు కలిగివున్న సామ్యేలు తను డ్రైవరుగా ఎవరింట్లోనైనా పనిచేస్తే ఎలా వుంటుంది అని ఊహించుకొనేవాడు. చాలామంది ఎవరైనా డ్రైవరు ఉద్యోగం చేస్తూ కారు ఓనరైతే ఎలాగుంటుంది అనుకుంటారు. అది సహజం. కాని సామ్యేలు కార్ల ఓనరైయుండి, తరచుగా డ్రైవరు ఉద్యోగం చేస్తే ఎలాగుంటుంది అని ఆలోచన వచ్చినప్పుడల్లా తనతో తానే నవ్వుకొనేవాడు. ఇప్పుడు తన సొంత ఊర్లో తన పెద్దక్క, తన భార్య పనిచేసిన హాస్పిటల్లో డ్రైవరుగా పనిచేయడం. అయినా సామ్యేలు తాను డ్రైవరునని చెప్పు కోడానికి ఎప్పుడూ సిగ్గు పడలేదు.

ఒకరోజు హాస్పిటల్ డ్రైవర్స్‌కు సంబంధించిన సర్క్యులర్ లెటరు కార్డియాలజిస్టు రెడ్డప్పగారు సామ్యేలు చేతికిచ్చాడు. ఆ లెటరు ఇంగ్లీషులో వుంది. రెడ్డప్పగారు మరలా ఆ లెటరు తన చేతిలోకి తీసికొని ప్రతి వచనాన్ని ఇంగ్లీషులో చదివి, దానిని తెలుగులోకి తర్జుమా చేస్తూ సామ్యేలుకి వినిపించాడు. సామ్యేలు మౌనంగా విన్నాడు. పూర్తయిన తర్వాత 'అర్థమ యిందా?' అని అడిగాడు. 'మీరు తెలుగులో కూడా ట్రాన్సిలేట్ చేసిన తరువాత అర్థం కాకుండా ఎలా వుంటుంది సార్' అన్నాడు సామ్యేలు. ట్రాన్సిలేట్ అన్న పదాన్ని అంత స్పష్టంగా విన్న రెడ్డప్పగారు 'ఏమి చదువుకున్నావు?' అని అడిగాడు. 'బి.ఏ.' అని చెప్పి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు సామ్యేలు. రెడ్డప్పగారు అలానే నిలుచుండిపోయాడు. డ్రైవర్ ఉద్యోగం అంటే ఏమిటో ఉద్యోగంలో చేరిన ఏనిమిది సంవత్సరాల తర్వాత కాని తెలిసిరాలేదు. అందులోను జిల్లా హాస్పిటల్లో అంబులెన్సు డ్రైవరు. రాత్రికి ఒక డ్రైవరు, పగలు ఒక డ్రైవరు. ఒక డ్రైవరు డేఆఫ్ అయితే మరో డ్రైవరు ఇరవైనాలుగ్గంటలు అందుబాటులో వుండాలి.

అందువలన చాల ఖర్చు, ప్రయాసతో కూడినప్పటికీ కాపురం ఒంగోలుకు తరలించవలసి వచ్చింది. హాస్పిటల్ ఎదురుగానే ఒక గది, ఒక బాత్‌రూం వుండే చిన్న ఇల్లు నూటయాభై రూపాయలకు అద్దెకు తీసుకొని కాపురం పెట్టాడు. రోడ్డు ప్రక్కనే ఇల్లు కావడం ఏ మాత్రం ఏమరు పాటున కాలు బైటపెడితే ఏ మోటారు బైకు క్రిందనో, కారు క్రిందనో పడిపోయే ప్రమాదం వుంది. ఒకరాత్రి స్నేహితుడు శంకరావు వచ్చాడు. పరిస్థితి చూసి చాలా బాధపడ్డాడు. వెంటనే వాళ్ళ ఇంటికి వెళ్లి ఒక టేబుల్ ఫ్యాన్ తెచ్చి సామ్యేలుకి ఇచ్చాడు. హాస్పిటల్ ఎదురుగానే ఇల్లు కావడం వలన ఏ అవసర మొచ్చినా, ఏ సమయంలోనైనా హాస్పిటల్ వాళ్లు సామ్యేలును పిలిపించేవారు. ఇన్ని సంవత్సరాలు పనిచెయ్య కుండా జీతము తీసుకున్నాడు కనుక ఇప్పుడు ఎంత కష్టమైనా అది చెయ్యడంలో విసుక్కోకూడదని నిర్ణయించుకున్నాడు. అందు వలన పై అధికారులలోకాని, తోటిపనివారిలో కాని సామ్యేలు సౌమ్యుడు అనే భావన ఏర్పడింది.

ఒంగోలు హాస్పిటల్లో చేరిన నాటనుండి దాసరి సుబ్బారావు అనే వ్యక్తి సామ్యేలు విషయాలలో చాల జాగ్రత్త తీసికొనేవాడు. మొదట్లో సామ్యేలుకు సుబ్బారావు ఎవరో ఎందుకు ఇంత ప్రేమాభిమానాలు చూపిస్తున్నాడో అర్థం కాలేదు. ఒకరోజు గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు ఒక పేషంటును అర్జంటుగా తీసికొని పోవలసి వచ్చింది. సుబ్బారావు కూడా అంబులెన్సులో కూర్చుని ఉన్నాడు. గుంటూరులో ఏదైనా పని ఉందేమోనని సరిపెట్టుకున్నాడు సామ్యేలు. గుంటూరు చేరిన తర్వాత హాస్పిటల్లో పేషంటును చేర్చి ఒంగోలు ప్రయాణమవుతుండగా సుబ్బారావు వచ్చి 'అన్నా, ఈ రోజు మా యింట్లో భోజనం చెయ్యండి. అక్కడే పడుకొని ఉదయాన ఒంగోలు వెళ్దాము' అన్నాడు. 'వద్దు, ఇప్పుడే ఒంగోలు వెళ్దాము' అన్నాడు సామ్యేలు. సుబ్బారావు మరీ బలవంతం చేస్తే వాళ్ళింటికి వెళ్ళాడు. చాలాగొప్పగా ఆతిథ్యం ఇచ్చాడు. గుంటూరులో అతని కాపురం. ఉద్యోగం ఒంగోలులో. అతని కుమార్తె అల్లుడు ఒంగోలులో ఉన్నారని అప్పుడు తెలిసింది. భోజనం తర్వాత సుబ్బారావు భార్య 'అయ్యా, ఈ ఉద్యోగం పది సంవత్సరాల క్రితం మా ఆయనకి

మీరే ఇప్పించారు' అంది. ఆమె నన్ను ఎవరో అనుకుంటుం దనుకున్నాడు సామ్యేలు. 'అమ్మా, నేనెవరో నీకు తెలుసా?' అన్నాడు. అంతలో సుబ్బారావు జోక్యం చేసుకొని 'అన్నా, పదిహేను సంవత్సరాల క్రితం మీ అక్కగారు హాస్పిటల్లో పని చేసేటప్పుడు హాస్పిటల్లో వంటపని ఖాళీ ఏర్పడినది. ఆ ఉద్యోగానికి ఎక్కడైనా వంట పనిచేసినట్లుగా సర్టిఫికేట్ తెమ్మన్నారు. మీ అక్కగారికి మీ హాస్టల్లో వంటచేసినట్లుగా కాగితం ఇమ్మని అడిగాను. మీ నాన్నగారిని కలవమన్నారు. నేను మీ యింటికి వచ్చి మీ నాన్నగారికి సంగతి చెప్పి, అయ్యా మీ హాస్టల్లో వంట పని చేసినట్లుగా సర్టిఫికేటు ఇప్పించమని అడిగాను. ఆయన నేను అబద్ధం చెప్పను, ఇవ్వను అన్నారు. అప్పుడు మీ అక్కగారిని మరలా అడిగాను. మా తమ్ముడు సామ్యేలును కలవమంది. నేను మీ దగ్గరకి వచ్చి అడిగాను. మీరు వెంటనే నన్ను ఏమి ప్రశ్నించకుండా లెటరుహెడ్ మీద వ్రాసి ఇచ్చారు. వెంటనే హాస్పిటల్లో వంట వానిగా చేరాను. తర్వాత మూడు సంవత్సరాలకి అంబులెన్సు అటెండరుగా మార్చారు. ఈ ఉద్యోగం మీ చలవేనన్నా' అన్నాడు. 'నాకేమీ గుర్తు లేవు' అన్నాడు సామ్యేలు. ఇంతకాలం సుబ్బారావు తనను అభిమానించడానికి కారణం ఇదా అనుకున్నాడు సామ్యేలు.

★ ★ ★

డిసెంబరు 31 రాత్రి పదకొండున్నరకి హాస్పిటల్ నుండి కాల్‌బాయ్ వచ్చి 'సూపరింటెండెంట్‌గారు రమ్మన్నారు' అని చెప్పాడు. 'ఏదైనా సీరియస్ కేసా?' అని అడిగాడు సామ్యేలు. 'అదేమి లేదండీ, సూపరింటెండెంట్‌గారు ఎక్కడికో వెళ్ళాలంట' అన్నాడు. 'సరే, ఇంకో పావుగంటలో ప్రార్థన వాచ్‌నైట్ సర్వీసు అయిపోతుంది. ఒక అరగంటలో వస్తానని చెప్పు' అని చర్చిలోకి వెళ్ళాడు సామ్యేలు. పన్నెండున్నరకి హాస్పిటల్‌కి వెళ్ళేటప్పటికి సూపరింటెండెంట్ గారు ఎక్కడికో వెళ్ళారని తెలిసింది.

జనవరి 1వ తేది ఉదయం స్టాఫ్ అందరితో కలసి సూపరింటెండెంట్‌గారిని దర్శించి విషస్ చెప్పి బయటికి వస్తుంటే సామ్యేలు ఆగి 'సంవత్సరంలో ఆఖరి రోజు కదండీ, ప్రార్థనలో వున్నాను. అరగంట తర్వాత వస్తే మీరు వెళ్ళిపోయారు' అని చెప్పాడు. 'సరేలే, వెళ్ళు' అని అన్నాడు ఆయన.

మరునాడు ఉదయం తొమ్మిదిన్నరకు ఆయన ఆఫీసుకు పిలిపించి 'నిన్న జనవరి ఫస్టు కాబట్టి నేను ఏమీ మాట్లాడ లేదు. సరే, నేను కబురు చేస్తే అరగంట ఆగి వస్తానన్నావంట. నా దగ్గరకి వచ్చి వెళ్ళి నీ పని పూర్తి చేసికోకపోయావా? నేను ఏమైనా చెయ్యగలను తెలుసా? నిన్ను సస్పెండు మాత్రమే కాదు డిస్మిస్ చెయ్యగలను. నువ్వు ఆఫ్ట్రాల్ డ్రైవర్‌వి తెలుసా?' అని పదినిమిషాలు అలాంటి మాటలే మాట్లాడాడు. సామ్యేలు ఏమీ మాట్లాడలేదు. ఆయన మాట్లాడేటప్పుడు ఆయన పళ్ళు ఎన్ని బయటకి కనబడతాయో, కుడి కన్ను కంటే ఎడమ కన్ను ఎన్నిసార్లు ఎగిరిపడుతుందో ఇవి మాత్రం జాగ్రత్తగా గమనిస్తున్నందు వలన ఆయన మాటల తీవ్రతను తన హృదయం మీద పని చెయ్యకుండా వుంచగలిగాడు. తర్వాత ఆఫీసులో నుండి బయటకు వచ్చాడు.

నేరుగా ఓబన్నగారింటికి వెళ్లి జరిగిన సంగతంతా ఆయనకు చెప్పాడు. ఆయన ఓపికగా విని 'ఏం చెయ్యాలను కుంటున్నావు?' అన్నాడు. 'ఈరోజు నుండి నేను హాస్పిటల్‌కి రాదలుచుకోలేదు సార్' అన్నాడ సామ్యేలు. ఆయన నవ్వి 'ఎంతకాలం వరకు రావు' అన్నాడు. 'మీరు తప్పని సరిగా డ్యూటీకి రమ్మని చెప్పేంత వరకు' అన్నాడు సామ్యేలు. ఓబన్నగారి ముఖం వికసించింది. 'వెరీగుడ్, క్యారీ ఆన్. కాని నేను పిలిపించినప్పుడు మాత్రం మా యింటికి రా' అన్నాడు. సంతోషంగా 'సరే సార్' అని ఇంటికి వచ్చాడు సామ్యేలు.

★ ★ ★

ఒక వారం రోజుల తర్వాత ఒంగోలులో ఒక పేరు మోసిన వ్యాపారి సామ్యేలు వద్దకు వచ్చాడు. 'సార్, మీ తండ్రిగారు ఎనభైవేలు మాకు బాకీ వున్నారు' అన్నాడు. సామ్యేలు ఆశ్చర్యపోయాడు. 'ఆయన బ్రతికి వున్నప్పుడు ఆయనను అడగలేదా?' అన్నాడు. 'ఇది ఇప్పటి బాకీ కాదండీ, పదమూడు సంవత్సరాల క్రితం మీరు హాస్టల్ నడిపేటప్పటిది' అన్నాడు. 'ఎనభైవేలు మా తండ్రిగారు మీ వద్ద ఎందుకు బాకీ చేశాడు' అని అడిగాడు. 'అసలు ఇరవై వేలే. వడ్డీ, లాయర్ ఖర్చులు, కోర్టు ఖర్చులు అన్నీ కలసి ఇంత అయింది. ఇప్పటికి కోర్టు డిక్రీ ఇచ్చింది' అన్నాడు ఆ వ్యాపారి. 'ఇంతకాలం నాకెందుకు చెప్పలేదు' అని అడిగాడు సామ్యేలు. 'మీరు మాకు దొరకలేదు' అన్నాడు. 'ఇంటి వద్ద మా వాళ్ళు వున్నారు కదా!' అన్నాడు సామ్యేలు. 'వాళ్ళెవరూ సరిగ్గా సమాధానం చెప్పలేదు. ఇప్పుడు మీరు వచ్చారని తెలిసి వచ్చాను' అన్నాడు ఆ వ్యాపారి.

# మకరజ్యోతి నిజమా?

2008 జూన్ 21-27 'ఈ భూమి' సామాజిక రాయకీయ వారపత్రికలో ప్రచురితమైన 'నిప్పులాంటి నిజం ఎట్టకేలకు బహిర్గతం' అనే శీర్షకన 'మకరజ్యోతి' యొక్క నిజ స్వరూపం గురించి వ్రాసిన వ్యాసమును యధాతధంగా మా పాఠకులకు అందిస్తున్నాము.

శబరిమలలో సంక్రాంతినాడు కనిపించిన 'మకర జ్యోతి' దైవత్వం ఎట్టకేలకు బట్టబయలైంది. స్వయంగా రాష్ట్ర మంత్రి, అయ్యప్ప దేవాలయ అధికారులు ఏటా కనిపించే 'మకర జ్యోతి' దైవం సృష్టించిన అద్భుతం కాదని, ఇది కేవలం మానవ కల్పితమని అంగీకరించారు. ఏనాటి నుండో హేతువాదులు చెప్తున్న మాటలు అక్షర సత్యాలని దీనితో తేలిపోయింది. కేరళ భారతదేశంలో అత్యధిక అక్షరాస్యత గల రాష్ట్రం. ఇక్కడ వామపక్ష ప్రజాస్వామిక ఫ్రంట్ ప్రభుత్వం దశాబ్దాల తరబడి రాష్ట్రాన్ని పాలించింది. కేరళలో ఎంతో బలమైన ప్రజా సైన్స్ ఉద్యమం ఉంది. అయినప్పటికీ ప్రజల్లో ఛాందసత్వం మాత్రం నేటికీ పూర్తిగా తొలగిపోలేదు.

సంక్రాంతి పర్వదినం నాడు శబరిమలలో అయ్యప్పను దర్శించుకొని మకరజ్యోతిని చూసి తరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఏటా ఇక్కడికి వస్తుంటారు. గత కొద్ది దశాబ్దాలుగా చుట్టుప్రక్కల అనేక రాష్ట్రాల నుండి వస్తున్న భక్తుల రాక పెరగటంతో ఈ తాకిడి మరింత ఎక్కువైంది. 'మకర విలక్కు' పండుగ 41 రోజులు జరుగుతుంది. చివరి రోజు మకరజ్యోతి కనిపిస్తుంది. ఆ రోజున ఎంత ఎక్కువగా భక్తుల వెల్లువ వుంటుందంటే 1999లోనయితే తొక్కిసలాట జరిగి 53 మంది చనిపోయిన పరిస్థితి ఏర్పడింది. అయ్యప్ప ఆలయం వద్ద అటవి ప్రాంత కొండలపై నుండి మకరజ్యోతి దర్శనమిచ్చే సంప్రదాయం సుమారు 50 ఏళ్ళ నుండే మొదలైంది.

పరుశురాముడు తొలుత మకరజ్యోతిని వెలిగించాడని స్థానిక పౌరాణిక గాథలు చెప్తాయి. దీంతో అప్పటి నుండి కొన్ని శతాబ్దాల తరబడి గిరిజనులు ఈ జ్యోతిని ప్రజ్వలింప జేస్తుండేవారట. 50 ఏళ్ళ నుండి ఇది దేవస్థానం అధికారుల అదుపాజ్ఞలలోకి వచ్చింది. "తమ కుటుంబ పెద్దలు ఏటా సంక్రాంతి రోజున మనుషుల్ని పంపి దివ్వెను వెలిగింపజేసే వారు. దాన్ని మూడుసార్లు అటూ ఇటూ తిప్పమని ఆజ్ఞాపించేవార"ని పందలం రాజకుటుంబానికి చెందిన పి. రవివర్మ చెప్పారు. తన చిన్నప్పుడు ఈ విషయాన్ని స్వయంగా గమనించానని అందువల్ల 'మకరజ్యోతి' దైవం సృష్టించిన అద్భుతం కాదని తనకు మొదటి నుండి తెలుసునని ఆయన పేర్కొన్నారు.

మకరజ్యోతి దైవత్వాన్ని హేతువాద నాస్తిక సంఘాలు అనేకసార్లు ప్రశ్నించాయి. పొన్నబలేందు కొండలనెక్కి స్వయంగా ఈ బండారాన్ని బయట పెడ్తామని సవాల్ చేశాయి. 1973వ సంవత్సరాన కొల్లంకు చెందిన కొందరు హేతువాదులు పొన్నంబలేందు కొండలనెక్కి దీపావళి మందుగుండు సామాగ్రిని కాల్చారు. వారిని ప్రభుత్వం అరెస్టు చేసింది. అయితే ఏ నేరమూ చేయనందున వీరిని విడుదల చేయక తప్పలేదు. 1980లో త్రిసూర్‌కు చెందిన మరో హేతువాద బృందం కొండల్ని అధిరోహించి జ్యోతి బండారాన్ని బయట పెట్టింది. 1981లో అదే తరహా ప్రయత్నం చేసిన కొందరిని ప్రభుత్వం అటకాయించింది. మకర సంక్రాంతి సందర్భంగా ఏటా 3 కోట్లమంది భక్తులు శబరిమల వస్తారని అంచనా. మొత్తం 41 రోజుల పాటు ఆయ్యప్ప గుడిని భక్తులు సందర్శించుకుంటారు.

కేరళలో ఈ మధ్య ఒక దొంగస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం హేతువాద, శాస్త్రీయ భావాల్ని పెంపొందించేందుకు, దొంగస్వాములకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించింది. ఈ సందర్భంగా కేరళ పర్యాటక శాఖ మంత్రి చెరియన్ ఫిలిప్ ఒక సంచలన ప్రకటన చేశారు. మూఢ నమ్మకాలపైన పోరాటాన్ని ప్రారంభించే ముందుగా సర్కారు మకరజ్యోతి గురించిన వాస్తవాల్ని బయట పెట్టాలని ఆయన కోరారు. మంత్రి వాఖ్య కేరళలో సంచలనం సృష్టించింది. దీంతో చివరికి ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (శబరిమల గుడిని నిర్వహించే సంస్థ), కేరళ దేవాదాయ మంత్రి బహిరంగంగా ఈ జ్యోతి

మానవ కల్పిత చర్యేనని ఒప్పుకుంటూ ప్రకటనలు జారీ చేయవలసి వచ్చింది. దీంతో ముసుగు తొలగిపోయింది.

అసలు ఇన్నాళ్ళు ఈ నిజాన్ని ఎందుకు దాచినట్లు? కేరళ వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన ప్రభుత్వాలు సైతం భక్తుల విశ్వాసం దెబ్బతింటుందనే పేరుతో మౌనంగా ఉండటం ఆశ్చర్యకరం!

ఏమైతేనేం తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఇప్పటికైనా అసలు నిజం వెలికివచ్చింది. అంతా బయటపడ్డాక అయ్యప్ప దేవాలయం సీనియర్ తాంత్రి మనుమడు, దేవస్థానం అధికార ప్రతినిధి అయిన రాహుల్ ఈశ్వర్ ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారు. మకరజ్యోతి దివ్యత్వం గురించి దేవాలయ అధికారులెప్పుడూ ప్రచారం చెయ్యలేదని ఆయన వివరణ ఇచ్చారు. అసలు మకరజ్యోతి అంటే సంక్రాంతి రోజు కనిపించే వెలుగుతున్న ఒక నక్షత్రమని ఆయన కొత్త వివరణ ఇచ్చారు.

అయ్యప్ప దేవాలయానికి విశ్వాసంతో భక్తులు వస్తారు. దేవుడి మీద నమ్మకం వున్నవారు పూజలు చేస్తారు. వరాలు కోరతారు. అది వారి వారి విశ్వాసం. భక్తి, విశ్వాసం, నమ్మకం వేరు. దేవుని పేరిట భక్తుల్ని మోసం చేయటం వేరు. భారత రాజ్యాంగం ప్రజల్లో హేతువాద, శాస్త్రీయ భావాల్ని పెంపొందించమని చెప్తుంది. ఇందుకు భిన్నంగా ప్రభుత్వాలే వ్యవహరించటం దారుణం. అయితే నిజం నిప్పు లాంటిదంటారు. అది ఎప్పటికైనా బయటకు రాక తప్పదు. కేరళలోనూ ఇదే జరిగింది.


రండి! గొప్ప ఆహ్వానము ఆరాధించెదము!!

ప్రతినెల రెండవ శుక్రవారము రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు

**సంపూర్ణ రాత్రి ప్రార్ధన జరుగును.**

స్థలము : యు.సి.యల్.ఐ. చర్చి, బాప్టిస్ట్ ప్రెయర్ హాల్ దగ్గర, ప్రార్ధన కొండ (ఒంగోలు కొండ),

కొండమిట్ట, ఒంగోలు - 523 001

మీ వ్యక్తిగత, కుటుంబ అవసరతల కొరకు, అన్ని సమస్యల కొరకు ప్రార్ధనలు చేయబడును

రండి కలిసి ప్రభుని ఆరాధించెదము.

సెప్టెంబర్ నెలలో జరగబోవు

**హనాకృప పాఠకుల సదస్సు**

కొరకు ప్రార్ధించండి

**ఫోన్స్ : 9866716506, 9908822365, 9394390723**

**చందా పంపదలచిన వారు :**

(S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా పంపవచ్చును.

నెం.**10957294362**

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఒంగోలు

కె. సామ్యేల్ రాజేంద్ర




సాక్ష్యము

# పులుకూరి విక్టర్ అబ్రాహం
## (హోం మిషనరీ, కందుకూరు)

పులుకూరి అంటే రౌతు. గుఱ్ఱపు రౌతు అని అర్ధము. అందరూ రౌతులు కాదుగాని ప్రత్యేకించబడిన రౌతులు అని అర్ధము. 1900 ప్రాంతంలో పొదిలి కాటంరాజుగారికి సంబంధించిన బాలరాజు గొట్లగట్టు పరిసర ప్రాంతంలో జమీను గలవాడు. బాలరాజుగారి సంతానం పిక్షిలి, సాధు, అబ్రాహాము, ఇంకా కొందరు వున్నారు.

1895లో బేకరు దొర ఎ.బి.యం. కాలేజి ప్రొఫెసరుగా నియమితులైనప్పుడు సాధు అతని స్నేహితులు తీవ్రమైన క్రమశిక్షణను వ్యతిరేకించి బేకరుకి ఎదురు తిరిగారు. రామాయపట్నంలో బైబిలు సెమినరి చదివి, ఒంగోలు జువెట్ మెమోరియల్ చర్చికి పాస్టరుగా నియమితులై దాదాపు 40 సంవత్సరాలు సేవ చేశారు.

అబ్రాహాముగారు గోగుమళ్ళ లోతుగారి సమకాలీనుడు. అబ్రాహాముగారిని నిజాయితీపరుడు అని పిలిచేవారు. కందుకూరులో స్వదేశి మిషనరీగా ఆయనను ఎన్నిక చేసినారు. స్వదేశి మిషనును సాధ్యమైనంత వరకు అమెరికన్ మిషన్‌కు దూరంగా వుంచారు. అబ్రాహాముగారి తర్వాత పసుమర్తి రాజారత్నంగారు హోం మిషనరీగా 1973 వరకు వున్నారు. హోం మిషనరీ గారైన పులుకూరి అబ్రాహాముగారి సంతానములో జయకుమార్‌గారు మద్రాసు వాస్తవ్యులు జేకబ్‌గారి ఏకైక కుమార్తె మెర్సీలీలమ్మను వివాహము చేసికొన్నారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. జ్యేష్టుడు డేవిడ్ జయకుమార్, సింగరాయకొండలో సేవ చేస్తున్నారు. రెండు గ్రేస్ కెల్విన్, మూడు రెవ. డి. సుకుమార్, నాలుగు విక్టర్ అబ్రాహాము.

1944లో జయకుమార్‌గారు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని యుద్ధం ముగిసిన తర్వాత మద్రాసులో దక్షిణ రైల్వేలో ఆడిటర్‌గా పని చేస్తూ పెరంబూరులో కాపురం పెట్టారు. 1955లో నాల్గవ సంతానమైన విక్టర్ అబ్రాహాము జన్మించిన తర్వాత ప్రభువు సేవ చెయ్యాలనే ప్రేరణలో 1955లో ఉద్యోగానికి రాజీనామా చేసి రామాయపట్నంలో సెమినరీ విద్య అభ్యసిస్తూ బి.డి. పూర్తి చేశారు. మొట్టమొదటిసారిగా గూంటూరు బాప్టిస్టు చర్చి పాస్టరుగా వుంటూ గుంటూరులో కాపురమున్నారు.

విక్టర్ అబ్రాహాం యొక్క చదువు గుంటూరు జెడ్.యం.పి. స్కూలులో సాగింది. తన తండ్రి జయకుమార్‌గారిని ఒంగోలు, యస్.టి.బి.సి. క్రిస్టియన్ హోం సెక్రటరీగా వున్నప్పుడు ఎ.బి.యం. హైస్కూల్లో చదివి, కర్నూలు కోల్స్ చర్చి పాస్టరుగా బదిలి చేసినందున ఇంటరు, డిగ్రీ కర్నూలులో చదివాడు.

1973లో జయకుమార్‌గారిని హోం మిషనరీగా కందుకూరుకు బదిలీ చేసినందున తిరుపతి హాస్టల్లో వుండి యం.ఏ. ఎకనామిక్స్ చదివి, 1975లో గ్రూప్-2 వ్రాసి పాసై సర్వీస్ కమీషన్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణుడై డిప్యూటీ తాహసీల్దార్ ర్యాంకులో గవర్నమెంటు ఇండస్ట్రీస్‌లో అసిస్టెంటు డెవలప్‌మెంటు ఆఫీసర్‌గా ఒంగోలులో ఉద్యోగంలో చేరాడు.

1979లో ఒంగోలు వాస్తవ్యులు ఫ్లావుల్లె రామన్, సరస్వతమ్మగార్ల మూడవ కుమార్తె శోభను మే నెల 17న కందుకూరులోని ఎ.బి.యం మిషన్ కాంపౌండ్‌లో స్వర్గీయ కె.ఆర్. సామ్యేల్‌గారిచే పరిశుద్ధ వివాహము జరిగించబడినది.

తన చిన్ననాట నుండి సేవా కార్యక్రమాలంటే ఇష్టము గలవాడు. తన తల్లి నిర్వహించే సండేస్కూలు క్లాసును కడగటం, సండేస్కూలు ప్రారంభించటానికి ముందే అన్ని సమకూర్చటం చేస్తూ తన తల్లికి సహాయ పడుతుండేవాడు. హైస్కూలు చదివేటప్పుడు చర్చీలో జరిగే యూత్ రిట్రీట్ సభలకు ప్రారంభము నుండి ఎన్నో సదుపాయలు కల్పిస్తూ తన తండ్రికి సహకారిగా వుండేవాడు. కాలేజి చదివేటప్పుడు ఎన్.సి.సి.లో చురుకుగా పాల్గొనేవాడు. స్టేట్ బెస్ట్ క్యాడెట్‌గా 1976లో ఎంపికై ఢిల్లీ రిపబ్లిక్ డే పేరేడ్‌లో పాల్గొన్నారు. పారా ట్రూపర్ ట్రైనింగ్ చేసినాడు.

1973లో తల్లిదండ్రులు కందుకూరు హోం మిషన్ బాధ్యతలు నిర్వహించేటప్పుడు ఒంటెద్దు బండిమీద దాదాపు వంద గ్రామాలు తిరిగేవారు. తనను దేవుని సేవకై వారు సమర్పించుకొని వేదాంత విద్య చదివించాలనుకుంటే తను మాత్రం యం.ఏ. చదువుతాను అన్నాడు. పాస్టర్లంటే బీదవాళ్ళు అని ఆయన భావన. యం.ఏ. చదివించలేదు కనుక బి.డి. చదువను అని అన్నాడు.

1983లో తన తల్లి మరణించారు. అదే సంవత్సరం

ఆగష్టులో ఆస్తులు గవర్నమెంటు వారి ఆధీనంలోనికి వెళ్ళకుండా కాపాడుటకు ఎలిమెంటరీ స్కూలు ప్రారంభించారు. ఆ స్కూలును పోషించుటకు ఇంగ్లీషు మీడియం స్కూలును ప్రారంబించారు. విక్టరుగారు గవర్నమెంటు పనిలో వుంటే, ఆయన భార్య శోభ తన తండ్రికి సహాయంగా స్కూల్లో పని చేస్తుండేది. కొంత కాలానికి శోభ సహాయం లేకుండా స్కూలు నడపటం కష్టమనిపించింది.

1980లో మొదటి కుమారుడు వినీల్, 1981లో కుమార్తె సౌమ్య, 1982లో రెండవ కుమారుడు వివేక్ జన్మించారు.

కందుకూరులో ఒక అనాధ శరణాలయం స్థాపించారు. 1992లో తన తండ్రి జయకుమార్ అస్వస్థులయ్యారు. అందువల సేవ కుంటుపడింది. ఆ రోజుల్లో బాప్టిస్టు మిషన్ గందరగోళంగా వున్నది. విక్టర్‌గారు ఉద్యోగంలో వున్నందున శోభగారు ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. తర్వాత జయకుమార్‌గారు చనిపోయారు.

1994లో తన ఉద్యోగానికి సెలవుపెట్టి కందుకూరు వచ్చినప్పటికీ దేవుని సేవ చెయ్యలేదు. వేదంత వాఙ్మయము మీద ఎక్కువ సమయం వెచ్చించి 1998లో డాక్టరేట్ తీసికున్నారు. తన తండ్రి మరణశయ్య మీద వున్నప్పుడు 'విక్టర్ నువ్వు సేవ చెయ్యి అని అనేకసార్లు తన చెయ్యి పట్టుకొని' అడిగాడు. 'యు ఆర్ ది బెస్ట్ జడ్జ్' అని అనేవాడు. ఆయన మరణానంతరం ఆ మాటలు ఎక్కువగా పనిచేసేవి.

1994లో ఉద్యోగములో ప్రమోషన్ వచ్చి ఒంగోలులో అసిస్టెంట్ డైరక్టరు అయ్యాడు. తర్వాత హైదరాబాద్ బదిలీ చేశారు. ఇక్కడ బాధ్యతలను వదలి హైదరాబాద్ వెళ్ళలేక సేవా కార్యక్రమాలను కొనసాగించుటకు ఉద్యోగం వదులుకోవాలనుకున్నాడు. అందుకు ఆయన భార్య పూర్తిగా సహకరించింది.

ఉద్యోగం చేస్తూ వున్నప్పుడే అప్పుచేసి తన సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నాడు. తన భార్య శోభకు ఆస్తుల మీదకాని, బంగారం మీదగాని, దుస్తుల మీదగాని ఆశలేదు. తను చేసే దానధర్మాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. డబ్బులు లేనప్పుడు ఎన్నడూ బాధపడలేదు. కనుక ఉద్యోగం వదిలేయడం కష్టం అనిపించలేదు కాని, ఉద్యోగం వదలిన తర్వాత లెక్కలేనన్ని కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. హాస్టల్ పిల్లలకి వందమందికి సహాయం వస్తే నూట ఏభైమందిని పోషించాల్సి వచ్చేది. స్కూల్సు వృద్ధిలోనికి వచ్చిన తర్వాత ఆర్థిక పరిస్థితి కొంత మెరుగైనప్పుడు వికలాంగులకు సహాయపడటం ప్రారంభించారు. విదేశీ సహాయమును ఎన్నడూ ఆశించలేదు.

ప్రభువు తన కార్యమును ప్రారంభించాడు. తండ్రి అస్వస్థులుగా వున్నప్పుడు పొన్నలూరులోని చర్చి శిధిలావస్థలో వుంది. కూలిపోతుందని సంఘస్తులు దానిని కూల్చి చెక్కలు అమ్మి ఎనిమిదివేల రూపాయలు ఆయన చేతికిచ్చారు. ఆ డబ్బు కుమారుడు విక్టర్ చేతికిచ్చి చర్చిని పునర్‌నిర్మించమన్నాడు.

కందుకూరులో హోం మిషనరీ కావాలని ఆయన కోరుకోలేదు. దైవికంగా ఇప్పుడు అక్కడ ఆయన నిర్వహిస్తున్న పనిపాటల వలన ప్రజలే ఆయనను మిషనరీగా గుర్తించనారంభించారు.

పాల సమాజములో అనేక గ్రూపులుండేవి. వాటిని ఏకం చెయ్యటానికి ఎందరో ప్రయత్నించారు. కాని సఫలీకృతులు కాలేదు. విక్టర్‌గారు ప్రార్థించి ప్రభువు సహాయంతో 86 సంఘాలుగా ఏర్పాటు చేశారు. తర్వాత అనేక సంఘాల్లో పందిళ్ళలో, పాకలలో ఆరాధనలు జరిగేవి. వాటన్నిటిని ఒకటి తర్వాత ఒకటి కొన్ని స్కీములు పెట్టి తను కొంత ధన సహాయం చేస్తూ పక్కా చర్చీ కట్టడాలుగా మార్చారు. 1995లో కందుకూరులోని బాప్టిస్టు చర్చిని నాలుగు లక్షలు వెచ్చించి ఆయన అధునాతంగా మార్చారు.

ఫోటోగ్రఫి అంటే చిన్నప్పటి నుండి ఆయనకిష్టమైన అలవాటు. తన కుమార్తె విదేశాల నుండి ఒక వీడియో కెమెరా పంపించింది. 2004లో సినిమా తీయటానికి సరిపోయే సామాను తన దగ్గర సమకూర్చబడి వున్నది. నటించటానికి తన ఆధీనములో మనుష్యులు వున్నారు. కనుక ఒక క్రైస్తవ సినిమా తీయాలన్న తలంపు కలిగింది. ప్రవక్తయైన దానియేలు సినిమా ఇంతకు పూర్వం ఎవరును నిర్మించి యుండలేదు. కనుక తన కుమారులకున్న టెక్నికల్ తెలివితో కుటుంబమంతా కలసి నిర్మించారు. దాదాపు వెయ్యి చోట్ల దానియేలు సినిమా ప్రదర్శన ఫలభరితమైనది. ఇప్పుడు సినిమా తీయటంలో అనుభవము వుంది కనుక ఎవరైనా ఆర్థిక స్థోమత కలిగిస్తే ఇంకా అనేక సినిమాలు తీయవచ్చునని భావిస్తున్నారు. దానియేలు సినిమా విశాఖ, శ్రీకాకుళం తండాలలో బహుగా ఆదరణ పొందినది.

(...మిగతా 25వ పేజీలో)

## క్విజ్ ఆగష్టు నెల ప్రశ్న ? 45

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. **ఆదామనే ఊరు ఎచ్చట కలదు?**
2. **ఇశ్రాయేలీయులలో సున్నతి కార్యము ఎంత కాలము జరుగలేదు?**

**జవాబుల కొరకు యెహోషువ 1వ అధ్యాయం నుండి 6వ అధ్యాయము వరకు చదవండి**

**జూలై నెల ప్రశ్నకు జవాబులు :**

1. దేవుని దృష్టికి నీతి ఏమిటి?
జవాబు: ద్వితియోపదేశకాండము 24:10-13
2. గుండెపోటు, చత్వారము, బి.పి. మొదలకు రుగ్మతలకు కారణము ఏమని వ్రాయబడినది?
జవాబు: ద్వితీయోపదేశకాండము 28:61-65

**సరియైన జవాబు వ్రాసిన వారు :**
**శ్రీమతి యం. సత్యవతి, నెల్లూరు**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు**
**శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి**
**శ్రీమతి సంపూర్ణ సాల్మన్, నర్సరావుపేట**

**ఈ నెల పోషకులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రీమతి విమలా రాజేశ్వరరావు | సామర్లకోట | 2000 | శ్రీమతి అమరమ్మ | ఒంగోలు | 200 |
| రెవ. విక్టరు అబ్రాహాం | కందుకూరు | 1500 | శ్రీమతి అనితా లూర్దు మేరి | కర్నూలు | 200 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 | శ్రీ ఆర్థర్ ప్రసన్న కుమార్ | కర్నూలు | 200 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 | శ్రీ ఎడ్విన్ పాల్ | కర్నూలు | 200 |
| డా॥ఇ.సి.దినేష్ | పులివెందుల | 1000 | శ్రీ యస్.సి. మిఖాయేల్ | కర్నూలు | 200 |
| శ్రీ టి. డేవిడ్ లివింగ్‌స్టన్ | నెల్లూరు | 700 | శ్రీ ఫెలిక్స్ | కర్నూలు | 200 |
| శ్రీమతి ఈ.వి. రాజకుమారి | నెల్లూరు | 500 | శ్రీమతి సత్యవాణి | తెనాలి | 200 |
| అపో. ఎబినెజరు | హైదరాబాద్ | 500 | శ్రీ కాంతారావు | తెనాలి | 200 |
| శ్రీమతి శాంతజగదీష్ | నంద్యాల | 500 | శ్రీ సాల్మన్‌రాజు | నర్సరావుపేట | 200 |
| శ్రీమతి నయోమి | తెనాలి | 500 | శ్రీమతి దొర్కా రాజు | నర్సరావుపేట | 200 |
| పాస్టర్ గోగుమళ్ళ ముకుందరావు | కరాలపాడు | 500 | రెవ. సుకుమార్ | కందుకూరు | 200 |
| శ్రీ చంద్రశేఖర్ | మార్కాపురం | 500 | పాస్టర్ సామ్యుల్ లాన్స్‌లాట్ | నాగంభోట్లపాలెం | 150 |
| శ్రీ కిరణ్ ప్రభాకర్ | కావలి | 500 | శ్రీ జాన్‌రబ్బీ | భీమునిపట్నం | 150 |
| శ్రీమతి రాజకుమారి జయకర్ | నంద్యాల | 500 | శ్రీ బొప్పూరి విజయం | బేస్తవారపుపేట | 150 |
| శ్రీ కృష్ణ, డబ్యు.బి.టి.సి. | బెంగుళూరు | 500 | శ్రీమతి రీటాప్రభు | నెల్లూరు | 150 |
| డా॥ బాబు డేవిడ్ లివింగ్‌స్టన్ | మార్కాపురం | 500 | శ్రీమతి స్వయంప్రభ | చిలకలూరిపేట | 150 |
| కుమారి జాయిస్ | రేపల్లె | 300 | పాస్టర్ ప్రసాదరావు | పాకల | 150 |

## ఎస్.యం.ఎస్. పరిచర్య



**ఎవరికైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు **ఎ.యన్.ఆర్.జక్కంగారు** ప్రతినెల రూ.1000/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



సాక్ష్యము

# రెవ. డా॥ కె.యం. జాన్

(డైరెక్టర్, అగాపె ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీస్, జనగాం)

కె.యం.జాన్‌గారు 1938 ఏప్రిల్ 24న వరంగల్లులో మల్లేశం, కనకమ్మగార్లకు జన్మించారు. తండ్రి చిన్నతనంలో మరణించాడు. అయితే తల్లిగారు దేవునియందలి విశ్వాసముతో ఎంతో ప్రయాసపడి ఆయనను పెంచి పెద్ద చేసింది. ఆమె ఆజాంజాహి మిల్లులో ఒక సామాన్య కూలిగా పనిచేస్తూ తన ఏకైక కుమారుని చదివించటానికి తను పని చేస్తున్న మిల్లు స్కూలులోనే 1 నుండి 4 తరగతులు చదివించింది. తర్వాత వరంగల్ బాప్టిస్టు సంఘ కాపరియైన రెవ. గంథం జేమ్సుగారి సహకారంతో జనగాంలోని ప్రిన్సటన్ ఇన్సిట్యూట్‌లో చేర్పించింది.

అక్కడే ఆయన తన నైపుణ్యాన్ని శక్తి సామర్థ్యాలను పెంపొందించుకున్నారు. 9వ తరగతి చదివేటప్పుడే తెలుగులో పద్య రచనలను వ్రాయటం సాగారు. క్లాసు పరీక్షలలో అత్యధిక మార్కులు సంపాదించేవాడు. ఆయన ప్రతిభను గుర్తించిన నాటి మిషనరీ మిస్ హెలన్.ఇ.బెయిల్ 1957లో వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేర్పించి సహాయం చేశారు. ఆయన చదివే రోజుల్లో 1957లో పద్యరచనలు ప్రథమ బహుమతి పొందారు. 1959లో ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో బి.ఎ. చదువుచు 1959లో ఎస్సే రైటింగ్‌లో ప్రథమ బహుమతి పొందారు. బి.ఎ. అయిన తర్వాత బి.యిడి చేసే రోజుల్లో అనేక కీర్తనలు పద్య రచనలు నాటికలు వ్రాశారు.

బి.యిడి. అయిన వెంటనే హైదరాబాద్‌లోని మెథడిస్టు బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకునిగా నియమితులైనారు. 1961 మే 18న పాస్టరు దామెర్ల ఎలీషాగారి కనిష్ట పుత్రిక జయమణిగారిని వివాహము చేసుకున్నారు. రెవ. జార్జి యల్.సి. గార్డన్‌గారిచే జహీరాబాద్‌లోని మల్టీసర్వీస్ మెథడిస్టు స్కూలులో రెండు సంవత్సరాలు పనిచేశారు. అప్పుడే ఆయన తన సేవా కార్యక్రమములో అల్లీపూర్ గ్రామంలో సండేస్కూల్‌తోపాటు చిల్డ్రన్ మినిస్ట్రీ ప్రారంభించారు.

1963లో నాటి ప్రిన్సటన్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ గారైన రెవ. దేవసహాయంగారు జాన్‌గారిని ప్రిన్సటన్ ఇన్స్టిట్యూట్‌లో పనిచేయుటకు ఆహ్వానించారు. భార్యా భర్తలిద్దరికీ అక్కడ ఉద్యోగావకాశం కల్పించారు. ఆ సంస్థ మీద అభిమానంతో సంతోషంగా ఆహ్వానాన్ని అందుకొని తన మాతృసంస్థలో పనిచేయుటకు వచ్చారు. అయితే ఇప్పుడు తను పనిచేస్తున్న మెథడిస్టు స్కూలు వారు ఆయనను వదులుకొనుటకు ఇష్టపడలేదు. అప్పుడు ఆయన అనేక శ్రమలను ఎదుర్కొని ఎన్నో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకొని చివరికి తన రెండు నెలల జీతం స్కూలు యాజమాన్యానికి చెల్లించి ఉద్యోగ బాధ్యతల నుండి విముక్తి పొంది జనగాం వచ్చారు.

జాన్ దంపతులిద్దరు ప్రిన్సటన్‌లో చదివి యున్నందున ఆ ఇన్స్టిట్యూట్‌ను అభివృద్ధిపరచుటకు ఎంతో శ్రమించారు. మొదట ఉపాధ్యాయునిగాను తర్వాత మొదటి తెలంగాణా ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌గాను పనిచేసి ఆ ఇన్స్టిట్యూట్‌ను కాలేజిగా మార్చారు.

మిషన్ ప్రాపర్టీస్ కస్టోడియన్‌గా అనగా ఆ సంస్థల ఆస్తుల సంరక్షణ బాధ్యతలను నిర్వహించు క్రమంలో ఆయన మూడుసార్లు కిడ్నాప్‌కు గురయ్యారు. ఆయన ప్రిన్సటన్ ఇన్స్టిట్యూట్ ద్వారా అనేక వేలమందిని పాఠశాలలో, సంఘాలలో, వైద్యశాలలో, వ్యాపార కేంద్రాలలో, సంస్థ కేంద్రాలలో రసాయనశాలలో, క్రీడారంగాలలో సమర్థులైన నైపుణ్యము కలిగిన ఉద్యోగులుగా ప్రవేశపెట్టిరి.

అమెరికన్ బాప్టిస్టు మిషన్ స్థాపకులైన రెవ. క్యాంప్‌బెల్ 1987వ సంవత్సరములో తన కుమారుడు చనిపోయిన సందర్భంలో అతని భూస్థాపన నిమిత్తము తన కుమారుని భూస్థాపన కార్యక్రమాన్ని ఆ స్థలములో జరిగించారు. ఆ సంధర్భంలో శ్రీ జాన్‌గారు రెవ. క్యాంప్‌బెల్ ఈ తెలంగాణా ప్రాంతములో అనేకమంది ఆత్మీయ కుమారులను కుమార్తెలను సంపాదించుకొన్నాడు, అందులో నేనూ ఒకడిని అని చెప్పుటకు నేను ఎంతో గర్వపడుచున్నాను అన్నాడు.

భారతదేశానికి, మరి ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో సేవ చేయటానికి వచ్చిన మిషనరీలను అనేక సంస్థలను, ప్రజలకు పరిచయం చేసి మిషనరీలకు చేయూతనిచ్చి తెలంగాణా ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించుట గొప్ప భాగ్యముగా ఎంచి బహుగా శ్రమించారు. పేదలకు ఇబ్బందులలో వున్నవారికి తన దయార్ద్ర హృదయాన్ని అందించారు. మరి ముఖ్యంగా వృద్ధాప్యములో వున్న సంఘకాపరులనేకులకు సహాయం చేయుటకు తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని స్థాపించుకున్నారు.

1950 సంవత్సరంలో యెహెజ్కేలు 18వ అధ్యాయంలోని

వాక్యభాగం ద్వారా దేవుడు కె.యం. జాన్‌గారితో మాట్లాడిన విధమునుబట్టి ఆయన తన జీవితాన్ని దేవునికి అంకితం చేశారు. మోరిస్ బ్లాన్‌చర్డ్‌గారు హెబ్రీ.11:23-27 వాక్యభాగమును మరియు 'ఆయన కొరకు జీవించాలి, ఆయన కొరకే మరణించాలి' అనే విషయం ప్రజలనుద్దేశించి చేసిన గొప్ప ప్రసంగాన్ని విన్న పిదప కె.యం.జాన్‌గారు సంపూర్ణంగా తన జీవితాన్ని దేవునికి అర్పించాలనే నిర్ణయాన్ని తీసుకొని 1954లో బాప్తిస్మము పొందినారు. 'మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును...' అనే వాక్యభాగాన్ని అనుసరించి పేదల కొరకు మరియు అవసరతలలో వున్నవారి కొరకు తన జీవితాన్ని అంకితం చేశారు.

కె.యం.జాన్‌గారు వైస్‌ఛైర్మన్‌గా మరియు జనరల్ కౌన్సిల్ సభ్యునిగా యస్.టి.బి.సి.లో సేవ చేసియున్నారు. యస్.టి.బి.సి లోని వివిధ కమిటీలలో పనిచేసి తన సేవలను వారికి అందించినారు. కీ॥శే॥ పులుకూరి సదానందంగారి సమర్థవంతమైన, చురుకైన నాయకత్వములో మరియు ఆయన కుమారుడు యస్.టి.బి.సి. మాజి అధ్యక్షుడు, ఎ.బి.డబ్యూ.ఎ. ఎస్.ఎ.ఓ. ఇండియా ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా (సి.ఇ.ఓ) అయినటువంటి పులుకూరి అబ్రాహాంగారి నాయకత్వంలో ప్రిన్స్‌టన్ ప్రధానోపాధ్యాయునిగా తన సేవలను అందించారు.

కె.యం.జాన్‌గారు తాను అనాధగా విద్యార్థిదశలో వున్న సమయంలో దేవుడు తన సేవ కొరకు జాన్‌గారిని పిలుచుకొనినప్పటి నుండి 'చిల్డ్రన్ మినిస్ట్రీ'యందు ప్రత్యేకమైన భారాన్ని కలిగియున్నారు. 1960లో వరంగల్‌లోని తన మాతృ సంఘంలో తన స్నేహితులైన సి. అబ్రాహాం మరియు బి.జె.డేవిడ్ అను వారితో కలిసి సుమారు 1200 మంది బాలబాలికలతో సమ్మర్ స్కూల్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఆ సమయంలో జాన్‌గారు తనకు బి.యిడి కోర్సులో వచ్చిన మెరిట్ స్కాలర్‌షిప్ డబ్బు ఆ ప్రోగ్రాం నిర్వహణ ఖర్చులకు వినియోగించారు. ఆ తరువాత జహీరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు అల్లిపూర్ గ్రామములో సండేస్కూల్ తరగతులను క్రమంగా నిర్వహించేవారు. 1958 నుండి అధిక ప్రాచుర్యము పొంది వి.బి.యస్. పాటలను వ్రాసిన మొదటి తెలుగు రచయిత జాన్‌గారు. అనేక వి.బి.యస్. మరియు చిల్డ్రన్ ప్రోగ్రాములను నిర్వహించారు. 2008లో వి.బి.యస్. ప్రోగ్రామ్స్ ద్వారా పది లక్షల బాలబాలికలను సమీకరించవలెనన్న వుద్దేశము వారి యెడల ఆయనకుగల భారాన్ని మనం అర్థం చేసుకొనగలము. వీరి ప్రోత్సాహము మరియు సహాయసహకారముల వలన అనేకమంది విద్యార్థులు సంఘకాపరులుగా, ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా, వైద్యులుగా, క్రైస్తవ మరియు ఇతర సంస్థల అధినేతలుగా ఉన్నత స్థానాలను పొందియున్నారు.

క్రైస్తవుల ఐక్యత మరియు సాక్ష్యాన్ని బలపరచు ఉద్దేశముతో ఆయన 1999లో అగాపే ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీస్‌ను స్థాపించియున్నారు. ఈ మినిస్ట్రీ ద్వారా (సంస్థ ద్వారా) జాన్‌గారు అనేకమైన ఉజ్జీవ కూటములను, యౌవనస్తుల మరియు బాలబాలికల కూడికలను ఏర్పాటు చేసినారు. అంతేకాక అనేక సంఘాలను నిర్మాణము చేసియున్నారు.

స్వయం పోషక కార్యక్రమాలైన గొఱ్ఱెల పెంపకం, ఎద్దులబండ్లు, టైలరింగ్, నేతపని, చాపల అల్లకం మరియు ఆదాయ వనరులను పెంపొందించు అనేక చిన్నతరహా వ్యాపారములను తమ సంస్థ ద్వారా అమలుపరచి అనేకమందికి సహాయపడినారు. అంతేకాక అనేకచోట్ల కమ్యూనిటీ బావులను, రోడ్లను, బస్‌స్టేషన్లను, కమ్యూనిహాల్స్‌ను నిర్మించియున్నారు. మద్రాసు ఐ.బి.ఎల్. సంస్థ డైరెక్టర్ డా॥ స్కాట్‌గారి సహకారముతో 50 గ్రామాలలో 'వయోజన విద్య' కార్యక్రమమును (తరగతులు) నిర్వహించియున్నారు.

1946లో ఈ భూమి పుత్రునిగా గాంధీగారి సిద్దాంతాలను అనుసరించినారు. జాన్‌గారు ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాస కాలములోనే వరంగల్‌లో గాంధీగారి ఆధ్వర్యములో జరిగిన ఒక సమావేశమునకు హాజరై పాఠశాల నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు గాను వారి ఉపాధ్యాయుడు తీవ్రంగా దండించారు. మాజీ విద్యాశాఖామాత్యుడైన శ్రీ పి.వి.రంగారావుగారిచే జాతీయ సమైఖ్యత అవార్డు పొందారు.

అగాపే ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీస్ ద్వారా తరిగొప్పులలో ఒక ఆలయం నిర్మించారు. 1959లో వరంగల్‌లో క్రిస్టియన్ కాలేజీలో మొట్టమొదటి పట్టభద్రుడైన వాడు జాన్‌గారే. 1961-64లో జాన్ దంపతులు రెవ. ఆల్బర్ట్‌స్లోటర్ మిషనరీ దంపతులతో కలసి రామాయపట్నంలో క్రైస్తవ నాయకుల శిక్షణా తరగతులు నిర్వహించారు.

తరిగొప్పుల గ్రామములో బాలసంతాన్ అను షెడ్యూల్ తెగల గుంపు పూర్తిగా రూపాంతరము చెందుటకు దేవుడు జాన్‌గారిని ఉపయోగించుకున్నాడు. బంజార డెవలప్‌మెంట్ ట్రస్ట్‌నకు మొదటి కన్వీనర్‌గా తన సేవలను అందించారు. 1975వ సంతవ్సరములో జనగాంలో సుమారు ఐదువేల మంది పాల్గొన్న మూడు రోజుల దక్కను ప్రాంత సెంటినరీ సెలబ్రేషన్స్‌లో వారికి వసతి, భోజనము ఏర్పాటుచేసి ఎంతో

చక్కగా కార్యక్రమాన్ని నిర్వహించి జయప్రదం చేశారు.

వీరు రచించిన దక్కన్ దర్శనం నాటకీయ కథలో వివరించబడిన 100 సంవత్సరాల దక్కను ప్రాంత చరిత్ర దక్కన్ సెలబ్రేషన్స్‌లోనే ప్రధానమైన అంశమైనది. 1960 నుండి జాన్‌గారిచే రచించబడి, బహుళ ప్రాచుర్యము పొందిన చిన్న పిల్లల పాటల వలన వీరిని వి.బి.యస్‌కు తండ్రిగా గుర్తించారు.

అనేక మంది అనాధలకు, పేదవారికి, అవసరతలలో వున్న బాలబాలికలకు, స్త్రీలకు, పురుషులకు ఆశీర్వాదరకంగా దేవుడు జాన్‌గారిని ఉపయోగించుకున్నాడు.

'గిడియన్ ఫెలోషిప్', జనగాం మరియు అలర్ ఏరియాకు అధ్యక్షులుగాను, 'వై.యం.సి.ఏ' జనగాంకు అధ్యకునిగాను పనిచేశారు. 'లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్' వారితో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకొని యున్నారు. 'వరల్డ్‌విజన్' ఆఫ్ ఇండియా వారు 25 సం॥లు వరంగల్ జిల్లాలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిం చుటలో జాన్‌గారిని ఆనరరీ అడ్మినిస్ట్రేటర్‌గా ఎన్ను కున్నారు. ప్రెస్టన్ ఇన్స్‌టిట్యూట్ భవనము శిధిలావస్థలో వున్నప్పుడు దానిని ఇతర మిషనరీల సహాయ సహకారములతో అధునాతనముగా రూపొందించి ప్రెస్టన్ ఇన్స్‌టిట్యూట్ కాంపౌండ్‌ను దాని ప్రాధమిక వనరులను తన స్వంత ఖర్చుతో అభివృద్ధి పరచారు.

జనగాం పొల సమాజములో అనేక సంఘాల స్థాపన కొరకు దేవుడు జాన్‌గారిని ఉపయోగించుకున్నాడు. 'రీచ్ తెలంగాణ' అనే దర్శనాన్ని దేవుడు జాన్‌గారికి చూపించి గొప్ప సేవ జరిగించాడు.

జాన్‌గారు దేవుని పరిచర్యలో వున్న కాలము నుండి దేవుడు వారి కుటుంబాన్ని ఎంతో అధికంగా ఆశీర్వదించాడు. జాన్‌గారికి ఆరుగురు సంతానము. నలుగురు అమెరికా దేశములో వున్నారు. మిగిలిన వారు మినిస్ట్రీ కార్యక్రమాల్లో సహకారంగా వుంటున్నారు. మినిస్ట్రీకి వీరు చేయు పరిచర్య ఎంతో విలువైనది.

జాన్‌గారికి పరలోకపు తండ్రియైన దేవుడు ఒక నూతన దర్శనాన్ని అనుగ్రహించాడు. అదేమనగా డా॥ జెన్ని డేవిస్ మరియు పాల్‌విగ్‌గారితో పాటు సేవాభారతి వారిని భాగస్తులుగా చేర్చుకొని 2008లో 'తెలంగాణ చేరుట' (రీచ్ తెలంగాణ) అనే కార్యక్రమము ద్వారా 2008లో వి.బి.యస్. ద్వారా పది లక్షల మంది బాలబాలికలను సమీకరించుట మరియు తెలంగాణాలోని పది జిల్లాలో వెయ్యి గృహ సంఘాలు స్థాపించు భారాన్ని జాన్‌గారు కలిగియున్నారు. ఈ దర్శన నెరవేర్పు కొరకు అందరూ ప్రార్ధించవలసినదిగా మనవి చేయుచున్నాము.

'యేసుక్రీస్తు సజీవుడు కనుక ఆయన పరిచర్య కూడా సజీవమైనదే' అని చెప్పారు. 'మనము ఆయన పరిచర్య చేయవలసినవారమైయున్నాము', 'ఉచితంగా అనుగ్రహించ బడినది కనుక ఉచితంగా యివ్వాలి', 'క్రీస్తు ప్రేమలో కొందరిని క్షమించాలి, కొన్ని మరచిపోవాలి' అనునది కె.యం.జాన్‌గారి ఫిలాసఫి అయివున్నది.

---

21వ పేజీ తరువాయి....)

దేవుని సేవలో సండేస్కూలు ప్రాముఖ్యతను నేటి సమాజమును సినిమాలు, టివిల వలన ఆకర్షింపజేసి సాతాను తన రాజ్యస్థాపనకు ఉపయోగించుకుంటున్నాడు. అదే ఆకర్షణతో సమాజమును చిన్న వయస్సు నుండే ప్రభువు వైపునకు ఆకర్షించుకొనుటకు మనం ఉపయోగిం చుకొనవచ్చును. ఆధునిక శాస్త్రమును ఉపయోగించి 'సీడ్ అండ్ షో జీజస్' అను కార్యక్రమమును ప్రారంభించారు.

బాప్టిస్టు హోం మిషన్ వ్యవస్థను నిద్రావస్థ నుండి ప్రజలందరూ మేల్కొని 2001లో నాల్గవ మిషనరీగా విక్టరు అబ్రాహాముగారిని గుర్తించారు. వందకు పైగా గ్రామాలలో సండేస్కూల్సును ప్రారంభించి సంవత్సరమంతా ఉపయోగించే విధంగా సిలబస్ పుస్తకమును రూపొందించి గ్రామాలలో బోధిస్తున్నారు. దానికి సంబంధించిన పాటలను, సి.డిలను రూపొందించారు.

2008 మే నెలలో పదిహేను వందలమంది చిన్న పిల్లలతో సండేస్కూలు ప్రోగ్రాము జరిగింది. హోంమిషన్ ద్వారా 30 మంది సంఘకాపరులు వారి కుటుంబాలు పోషింపబడుచున్నవి. రాబోవు రోజులలో మీడియా ద్వారా బైబిలు కథలు సినిమాగాను, వీడియో సినిమాలు తయారు చేయనున్నారు. సంఘాలలో సండేస్కూల్స్‌కు క్యాసెట్స్, సి.డిలు తయారు చేస్తున్నారు.

1876లో అధికార పూర్వకంగా జన్మించి పెరిగి పెద్దదై శాఖోపశాఖలుగా విస్తరించి, 1972 నుండి క్షీణించి సగం మరణించి కోర్టులలోను, క్రయ విక్రయ లావాదేవీలకు నిలయమైన 'బాప్టిస్టు' ఆరోగ్యంగా జీవిస్తుందంటే అది కందు కూరు హోం మిషనరీలోనే. ప్రభువుచే అభిషేకించబడిన పులు కూరి విక్టర్ అబ్రాహాముగారిని, వారి కుటుంబమును భవిష్య త్తులో దేవుడు మిక్కిలి ఆశీర్వదించి, తన నామ మహిమ కొరకు, తన రాజ్యవిస్తరణ కొరకు ఉపయోగించుకొనును గాక!

# ప్రయాణంలో మజిలీ

జూలై నెల 18వ తారీకున ఉదయం ఏడు గంటలకు నెల్లూరు చేరాను సహోదరి వైలెట్ రాజకుమారి గారింటికి వెళ్ళి, వారి కారులో గవర్నమెంటు ఆసుపత్రికివచ్చి అక్కడ నుండి ఆటోలో కోవూరులోని పాస్టరు మార్కుగారింటికి వచ్చాను. వారితో ఒక గంట సమయం గడిపి, అక్కడ నుండి చిన్న పడుగు పాడులో సహోదరుడు ముక్కర ఇమ్మానుయేలు గారింట్లో ప్రార్ధించి ఇనమడుగు గ్రామం వచ్చేటప్పటికి మధ్యాహ్నం అయింది.

ఇనమడుగులో గోపిచెట్టిగారింట్లో వ్యాధిగ్రస్తురాలై, ప్రార్ధన వలన స్వస్థతనొందిన వారి కుమార్తెను చూడటానికి వెళ్ళాను. వారింటికి వెళ్ళిన వెంటనే గోపిచెట్టి అల్లూరు సెటిల్‌మెంటులో నివశించే దేవరకొండ సూరిగారి సహోదరుడైన రవి కుమారుడు, తన స్నేహితుడైన రమేష్ ఇంటికి వెళ్ళి ప్రార్ధించి, వాక్యపరిచర్య చేయవలసినదిగా కోరాడు. ఇప్పుడు నేను నెల్లూరు నుండి వస్తున్నాను, అదీగాక ఎండ తీవ్రత ఎక్కువగా వుంది, చాలాదూరం నడచి అలసిపోయాను కనుక మరలా నెల్లూరు ఎలా వెళ్ళాలి? అదీగాక ఒంగోలు ఆఫీసులో చాలా అర్జంటుగా పోస్టు చెయ్యాల్సిన ఉత్తరాలు వున్నాయి అనుకొని 'ఇప్పుడు కాదు ఈసారి నెల్లూరు వచ్చినప్పుడు వారిని చూస్తాను' అని చెప్పినా గోపిచెట్టి పట్టుబట్టి మీరు ఇప్పుడు వారింట్లో ప్రార్ధన చెయ్యవలసిన అవసరం చాలా వుంది అని చెప్పి నెల్లూరులోని రమేష్‌గారికి ఫోను చేసి హన్నాకృప పాస్టరుగారు నెల్లూరు వస్తున్నారు అని చెప్పాడు.

నేను నెల్లూరు బస్టాండులో వారు చెప్పిన ప్రదేశానికి వచ్చేసరికి రమేష్ తన కారులో నా కొరకు ఎదురు చూస్తున్నాడు. నవాబ్‌పేటలోని వారింటికి వెళ్ళి రమేష్ తండ్రి రవికుమార్‌గారికి కొంతసేపు వాక్యపరిచర్య చేసి ప్రార్ధనకు సమాయత్తమగుచుండగా ఇంట్లోవున్న రవిగారి తల్లి నన్ను లోపల గదిలోనికి ఆహ్వానించారు. ఆమె చాలాకాలం క్రితం యేసుప్రభువును తన రక్షకునిగా అంగీకరించి తన పేరును ఇవాంజలిన్‌గా మార్చుకొనిన విశ్వాసి అని గ్రహించాను.

నా సూట్‌కేసులోని హన్నాకృప మాసపత్రిక ఆమె కిచ్చాను. దానిని చూడగానే ఆమె ఎంతో ఉత్సాహంగా, అయ్యా ఈ పత్రికను నేను ప్రతి నెల చదువుతాను. ఈ పత్రికను నేను ఎలా తెప్పించుకోవాలో నాకు తెలియదు అని చెప్పారు. నేనే ఈ హన్నాకృప పత్రికను నడిపిస్తున్నానని తెలుసుకొని చాలా సంతోషిం చింది. అయ్యా, జప్పత్వనేహు అనే పుస్తకం చదివాను. దాని తరువాతి భాగము ఆసెనతు కొరకు గత ఆరునెలలుగా వెదకు చున్నాను. ఏ ఊరు వెళ్ళినా ఆ ఊరి పాస్టరుగారిని పుస్తకం అడుగుతాను. కాని నాకు దొరకలేదు అంది. నా దగ్గర ఆసెనతు పుస్తకం ఒక్కటే అందులో వుంది. అది ఆమెకిచ్చాను. నేనే దాని రచయితను అని చెప్పినప్పుడు 'అయ్యా, ఈ దినం ఉదయం కూడా ఈ పుస్తకం కొరకు నేను దేవుని ప్రార్ధించాను. ప్రభువు మిమ్మల్ని నాకోసం ఈ ఇంటికి తీసుకొని వచ్చారు' అని చెప్పింది.

ప్రార్ధన అయిపోయిన తర్వాత ఇంట్లో నుండి బయటకు వచ్చాను. ఎండ బహు తీవ్రంగా వుంది. ఒంగోలు ప్రయాణం విసుకు వేసింది. అంతలో సెల్ మ్రోగింది. నేను లిఫ్ట్‌చేసి నప్పుడు 'నేను సామర్లకోట నుండి విమలమ్మను మాట్లాడు తున్నాను' అని చెప్పింది ఆమె. 'నమస్కారమమ్మా ఏమిటి సంగతి?' అని అడిగాను. వారిని నేను చూసి ఇప్పటికి మూడు సంవత్సరాలైంది. వారు విట్టికర్ గరల్స్ హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్‌గా పనిచేస్తూ వుండేవారు. తర్వాత రిటైరయ్యారు. వారు హన్నాకృప పత్రికను క్రమంగా చదువుతారు. చాలా కాలం క్రితం నా రచనలన్నీ చదివారు.

ఇప్పుడు ఈ సమయంలో ఎందుకు ఫోన్ చేశారా అని అనుకుంటూ 'చెప్పండమ్మా' అన్నాను. 'అయ్యా, నేను ఇప్పుడే పెద్దాపురం వెళ్ళి మీ ఆన్‌లైన్ అకౌంటులో రెండు వేల రూపాయలు మీకు పంపించాను, తీసుకోండి' అని చెప్పింది.

ఆమె మాటలు విని నేను ప్రభువు ఎదుట సిగ్గుతో తలవంచుకున్నాను. ఇనమడుగు నుండి వెనుకకు నెల్లూరు వెళ్ళి ప్రార్ధన చెయ్యటానికి నాకు ఎండ అడ్డం వచ్చింది. నా ఉద్యోగమే సువార్త సేవ అయితే నేను ప్రభువు పనికి నా మనస్సులో విసుక్కున్నాను. అయితే నా మంచిచెడ్డలు చూస్తున్న నా దేవుడు వందల కిలోమీటర్ల దూరంలో వున్న తన దాసురాలిని ప్రేరేపిస్తే ఆమె తన కష్టార్జితమును ప్రభువు మాట ప్రకారం నడచు కొనుటకు అదే ఎండలో మరో పట్టణం వెళ్ళి బ్యాంకులో చెల్లిం చింది. ఇంటికి వస్తే చందా ఇవ్వడం కంటే, ఆ చందా చెల్లించ టానికి బ్యాంకుకు కాని, పోస్టాఫీసుకు కాని వెళ్ళటం డబ్బు ఇవ్వటం కంటే గొప్ప సమర్పణ హృదయం కావాలి.

ప్రభువు నా జీవితంలో లెక్కలేనన్ని ఆశ్చర్యకార్యములు జరిగించినా, ఆయన పనికి పాలుమాలే నా ప్రవర్త విషయం ఎంతో చింతించి, ప్రభువును క్షమాపణ కోరి, విమలమ్మగారి సమర్పణకి తగిన ఫలితం ప్రభువు చెల్లిస్తాడని విశ్వసిస్తున్నాను.

# సువార్తలలోని యేసు కథ



పర్ణశాలల పండుగ ముగిసినప్పుడు యెరూషలేము దేవాలయాధికారులకు పెద్దలకు యేసుమీద పూర్తిగా ద్వేషము నిండుకొనినది. ఆయనను ఎలాగైనా బంధించాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఆయన ఘడియ ఇంకనూ రాలేదు కనుక ఆయన గలిలయ చేరుకున్నాడు. కపెర్నహూములో కొన్ని దినములు గడిపిన తర్వాత తన సమయము సమీపిస్తున్నది అని ఎరిగి ఆయన మరలా యెరూషలేము వైపుగా ప్రయాణమయ్యాడు. శిష్యులైతే ఇందుకు ఇష్టపడలేదు. ఈసారి ఆయనకు తప్పక అపాయము కలుగ వచ్చునని అనుకున్నారు. గలలియలోనే నిలిచిపొమ్మన్నారు. ఆలయ ప్రతిష్ఠ పండుగ దగ్గరకొచ్చే టప్పటికి శిలువ నీడ ఆయన గమనిస్తున్నాడు.

ప్రారంభంలో యేసుకు వందలు వేలు శిష్యులు వుండే వారు. ఐదువేలమంది పురుషులకు అయిదు రొట్టెలతో తృప్తిగా ఆహారం పెట్టినప్పుడు 'మీ సహోదరులలో నుండి నావంటి ప్రవక్తను మీ కొరకు పుట్టించెదను. అతని నోట నా మాటల నుంచెదను' అని చెప్పియున్నాడు మోషే- పరలోకము నుండి అనుదినము ఆహారము రప్పించాడు. ఈ యేసు అయిదు రొట్టెలతో పదివేలమందికి పైగా జనానికి ఆహారం పెట్టాడు కనుక ఈయనే 'ఆ ప్రవక్త' అని ఆయనను రాజును చెయ్యాలనుకున్నారు. అయితే యేసు నా శరీరము నిజమైన ఆహారము, నా రక్తము నిజమైన పానీయము. నా శరీరము తిని, నా రక్తము త్రాగువాడే నిత్యజీవముగలవాడు అని చెప్పినప్పుడు. ఇది కఠినమైన మాట. ఇది ఎవడు వినగలడని పన్నెండుమంది అపొస్తులులు తప్ప అందరూ ఆయనను వదలి వెళ్ళిపోయారు.

అయితే తర్వాత మరలా అనేకులు ఆయనను వెంబడించారు. మొదట్లో తన శిష్యులలో డెభైమందిని పిలిచి తనకంటే ముందుగా వారు సమరయ మీదుగా యెరూషలేమునకు ప్రయాణం చేసే మార్గములో తనకు బస ఏర్పాట్లు, వాక్య ప్రకటన చేయటానికి పంపించాడు. మొదట పన్నెండు మందిని పంపించినప్పుడు వారిని సమరయ పట్టణములలో దేనిలోనికి ప్రవేశించవద్దన్నాడు. అయితే ఈసారి ఆ ఆంక్ష పెట్టలేదు. మొదటిసారి ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలకు సూచనగా పన్నెండుమందిని మోషే పంపినట్లుగా పంపించాడు. ఇప్పుడైతే మోషే అహరోనుతో డెబ్బదిమంది ఇశ్రాయేలీయులు సినాయి పర్వతము ఎక్కి దేవుని చూచిరి. అంతేకాక నేటి సన్హెద్రిన్ సభలో యూదమత ప్రవిష్టులు డెభ్బైమంది కూడ ప్రధాన యాజకుని అధ్యక్షునిగా చేసికొని యూదమతాన్ని పరిపాలిస్తున్నారు. వారు దేవుని వాక్యమును, ధర్మశాస్త్రమును, మెస్సయ్యను ఎరుగరు. దేవుని రాజ్యాన్ని ఎరుగరు కనుక ఇప్పుడు ఈ డెభ్బైమంది శిష్యులు తనకంటె ముందుగా తను దర్శించే గ్రామాలలో పర్యటించి దేవుని రాజ్యమును గూర్చిన సువార్త ప్రకటించవలసి యున్నది.

వారిని పంపే ముందుగా 'కోత విస్తారముగా వున్నది. కాని పనివారు కొద్దిమంది మాత్రమే వున్నారు. కోత పని వాయిదా వేస్తే పాడైపోతుంది. కనుక కోతకు పనివారిని పంపమని కోత యజమానుని వేడుకొనండి' అని చెప్పాడు. రెండవదిగా, వీరి ప్రయాణంలో లేక ఈ రెండవ సువార్త దండయాత్రలో రాబోయే వారికి అపాయములను గురించి చెప్తూ గొఱ్ఱెలవలె తోడేళ్ళ మధ్యకు పోతున్నారు కనుక మెళకువ కలిగి వుండమన్నాడు. వారు ఒంటరిగా వెళ్తున్నా వారిని పంపినవాడు గమనిస్తూ వుంటాడు కనుక రేపటిని గూర్చి విచారింపక సేవ చేస్తున్న వారి యొద్ద నుండి రావలసినవన్నీ పొందుతుండాలి. సమాధాన సువార్త అనే వందనము చెయ్యండి, మీకు మరలా సమాధానము వస్తే, అప్పుడు దేవుని ప్రణాళికలో మీరు ఉన్నారని తెలుసుకుంటారు అన్నాడు.


ఏదైనా గ్రామంలో కష్టాలు ఎదురైతే ఆ గ్రామ శివారు లోనికి వచ్చినప్పుడు వారి పాదముల దుమ్ము కూడ అవసరం లేదని అక్కడే దులిపి వెళితే ఆ ధూళి మన విషయంలో దేవునికి సాక్షి అవుతుంది అని చెప్పి యొర్దాను అవతల బేతనియ నుండి శిష్యులను సాగనంపేడు. తిరిగి వారు వచ్చే వరకు అక్కడనే వుండి వారి కొరకు ఎదురు చూడసాగాడు.

**Easy to Read Bibles, New Testaments & Portions in 14 major languages in India**

Subsidized Rates!

Gift a Bible to your Friend! Order Now!!

**Gift & Award Editions**



English Bible (Vinyl bound)

English Bible (MULTICOLOR Paperback)

**New Testaments**






**Portions**

**Free Membership**

*Become a member and get Bibles, NTs and Portions at subsidized rates!*

**Special Offer on Telugu Bibles & NTs**

*Avail FREE* Postage and Transportation*



* For limited period only

You can help provide God's Word to children, seekers, AIDS patients, neo-literates, prisoners and poor people in villages. Please send your contribution and we will distribute the Scriptures on your behalf.

Read
Download FREE
Buy
Donate Online
*Visit us at:*
www.wbtcindia.com

*For further information please write to:*

WBTC
World Bible Translation Center-India
P.O. 8478, Bangalore - 560084.
Ph.: 080-25468075, 25475863. Fax: 080-25475862.
Email: info@wbtcindia.com; Website: www.wbtcindia.com

# ఏది నిజము? ఏది అబద్ధము? 4

**(లోకానికి బైబిల్ సవాల్)**

హేతువాదుని ప్రశ్న – 15

**ఏడవ దినమును దేవుడు ఆశీర్వదించి పరిశుద్ధ పరచెనా? లేక ఆజ్ఞాపించెను కనుక అచరింపవలెనా?**

నిర్గ. 20:1,10,11, 'దేవుడు ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తె యైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఆరుదినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను; అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దానిని పరిశుద్ధ పరచెను'.

ద్వితీ. 5:4,5,14,15, 'యెహోవా ఆ కొండమీద అగ్ని మధ్య నుండి ముఖాముఖిగా మీతో మాటలాడగా మీరు ఆ అగ్నికి భయపడి ఆ కొండ యెక్కలేదు. గనుక యెహోవా మాట మీకు తెలియజేయుటకు నేను యెహోవాకును మీకును మధ్యను నిలిచియుండగా యెహోవా ఈలాగు సెలవిచ్చెను – ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము. దానిలో నీవైనను, నీ కుమారుడైనను, నీ దాసుడైనను, నీ దాసియైనను, నీ యెద్దయినను, గాడిదయైనను నీ పశువులలో ఏదైనను యిండ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఎందుకంటే నీవలె నీ దాసుడును దాసియును విశ్రమింపవలెను. నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలముచేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతిదినమును ఆచరింపవలె నని నీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించెను.

**జవాబు :** దేవుడు ఈ వాక్యములను గురించి మోషేతో ఇశ్రాయేలీయులందరితో చెప్పవలెనని తలంచెను. కాని సీనాయి పర్వతము మీద వున్న అగ్ని వలన ఇశ్రాయేలీయులు భయము నొందిరి. కాబట్టి వారు ఆ పర్వతము మీదికి ఎక్కి వెళ్ళలేదు. అయినప్పటికిని దేవుడు మోషేతో మాట్లాడి ఈ ఆజ్ఞలను ఇచ్చెను. ఆది. 2:2 'దేవుడు తాను చేసిన తన పని యేడవ దినములోగా సంపూర్తి చేసి తాను చేసిన తన పనియంతటి నుండి యేడవ దినమున విశ్రమించెను'.

నిర్గమ. 20:1,10,11లో వ్రాయబడిన ప్రకారము దేవుడు సబ్బాతు దినమును ఆశీర్వదించి పవిత్రపరచెను. నిర్గమ మరియు ఆదికాండములో రాయబడిన ఈ రెండు వచనాలలో ఎటువంటి తేడా లేదు. కాని మోషే దేవుడు ఆశీర్వదించి పవిత్ర పరచిన సబ్బాతు రోజును ఒక ముఖ్యమైన దినముగా భావించి ఇశ్రాయేలీయులకు సబ్బాతు దనమును ఒక ఆజ్ఞగా ఆచరించవలెని చెప్పెను. ఇందులో ఏమైన ప్రశ్న ఉందా?

హేతువాదుని ప్రశ్న – 16

**ఎప్పటికి ఉన్న ధర్మశాస్త్రము నిబంధనకు పౌలు ఒక చిల్లు పెట్టెను?**

లేవి. 23:14,21,31,41, 'ఇది మీ తరతరములకు మీ నివాస స్థలములన్నిటిలో నిత్యమైన కట్టడ'.

రోమా 7:6, 'ధర్మశాస్త్రము నుండి విడుదల పొందితిమి'.

**జవాబు :** ఇక్కడ రోమా 7:6 నుండి మనకు ఏమి అర్థమగు చున్నది? ఆత్మానుసారముగా నవీన స్థితిగలవారికి మాత్రమే పాత స్థితి నుంచి అనగా ధర్మశాస్త్రము నుండి విడుదల. అనగా ఎవరైతే ఆత్మీయ ఫలములను ఫలింతురో వారికి ధర్మ శాస్త్రముతో అవసరత లేదు. ఆత్మీయ ఫలములు అనగా గలతీ. 5:22, 'ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘ శాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము'.

మరి ఎవరికి ఈ ధర్మశాస్త్రము విధించబడుతుంది. గలతి. 5:19–21, ' శరీరకార్యములు స్పష్టమైయున్నవి. అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహా రాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, బేధములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి.

ధర్మశాస్త్రము యొక్క నిబంధనలు పైన చెప్పబడిన లక్షణములు గలవారికి మాత్రమే అన్వయించబడుతుంది. ఈ దేశం ఆ దేశం అని తేడా లేకుండా ప్రతి దేశం యొక్క రాజ్య పరిపాలనలో ధర్మశాస్త్రము యొక్క నిబంధనలను యుగాంతం

వరకు నిత్య కట్టడగా ఆచరణలో పెట్టియున్నవి. ఆత్మఫలములు కల్గిన మదర్ తెరీసా వంటి వారికి ధర్మశాస్త్రంతో పనిలేదు.

ఇది ఎప్పటికి వుండే నిబంధన అనునది పాత నిబంధన కాలము నాటిది. కాని నూతన నిబంధన కాలములో ధర్మశాస్త్రము నుండి యేసుక్రీస్తు నామములో విడుదల పొందియున్నాము. యేసుక్రీస్తు ధర్మశాస్త్రములోని నిబంధనలను సంపూర్తిగా నెరవేర్చి ఆత్మానుసారముగా మనకు విడుదల కలుగజేసెను. పాతనిబంధనలో ఈ నిబంధన నుండి విడుదల పొందిన వారు ఎవరైనా ఉన్నారా? అవును, వున్నారు. యెషయా 43:25, 'నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమములను తుడిచి వేయుచున్నాను'.

యెహెజ్కేలు 18:23, 'దుష్టులు మరణము నొందుట చేత నాకేమాత్రమైనా సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొని బ్రదుకుటయే నాకు సంతోషము. ఇదియే ప్రభువైన యెహోవా వాక్కు'.

ఇందునుబట్టి మనము ఏమి గ్రహించాము? ఇక్కడ పాత నిబంధనకు క్రొత్త నిబంధనకు తేడా లేదని గ్రహించాము. పాత నిబంధనలో కూడ పాప క్షమాపణ వుంది. అంతేకాదు ఎవరైతే పాపాలకు పశ్చాత్తాప పడతారో వారిని దేవుడైన యెహోవా క్షమించెను.

ఉదా: నీనెవె పట్టణం. యోనా వారి యొక్క నాశనమును గురించి బోధించినపుడు వారు తమ పాపములకు పశ్చాత్తాపపడి దేవుని యొద్ద నుండి రక్షణ పొందిరి. మరి ఎవరికి ఎప్పటికి ఉండే నిబంధన? ఈ ఎప్పటికి వుండే నిబంధన పాపాత్ములకు మాత్రమే. కాని వారి పాపముల నుండి పశ్చాత్తాప పడినట్లయితే వారు ఆత్మానుసారము నుండి విడుదల పొందుదురు.

మత్తయి 5:38,39, 'కంటికి కన్ను, పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు కదా. నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడా త్రిప్పుము'. ఈ విధంగా చేయుట ద్వారా ఎలాంటి అనర్థాలు జరుగవు. దీనినే నవీన స్థితి అంటారు

హేతువాదుని ప్రశ్న - 17

**చెప్పేవి శ్రీ రంగనీతులు....?**

నిర్గ. 20:3, 'నరహత్య చేయకూడదు'.

నిర్గ. 32:27, 'అతడు (మోషే) వారిని (లేవీయులను) చూచి మీలో ప్రతివాడును కత్తిని నడుమున కట్టుకొని పాళెములో ద్వారము నుండి ద్వారమునకు వెళ్ళుచు, ప్రతివాడు తన సహోదరుని, ప్రతివాడు తన చెలికానిని ప్రతివాడు తన పొరుగువానిని చంపవలెనని ఇశ్రాయే లీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చుచున్నాడనెను'.

**జవాబు :** అచ్చట మత్తయి 5:38లోవలె కంటికి కన్ను, పంటికి పల్లు అను ధర్మశాస్త్రము ఆచరింపబడుచున్నది. అనగా నీతికిని అవినీతికిని యుద్ధం (పోరాటము) జరిగే సమయంలో వావి వరసలు సంబంధ బాంధవ్యాలు నీతికి దూరమైనవి. అవినీతి పరుడైనా కూడా దేవుని దృష్టికి పాపి.

తండ్రి పోలీసు అయినప్పుడు కుమారుడు నేరము చేసినట్లయితే అతడు దోషియే. ఇక్కడ బాంధవ్యముగాని రక్తసంబంధముగాని దయాదాక్షిణ్యములుగాని వగైరాలకు చట్టము ఆమోదించదు. ఇందుకు సాక్ష్యము - క్రీస్తు చెప్పిన మాట : లూకా 14:26, 'ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెంఢ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు'.

హేతువాదుని ప్రశ్న - 18

**సాత్వికత్వమంటే స్త్రీ పురుషులను వధించడమా?**

సంఖ్యా. 12:13, 'మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు'

సంఖ్యా. 31:14,17,18, 'అప్పుడు మోషే యుద్ధ సేనలోనుండి వచ్చిన సహస్రాధిపతులను శతాధిపతులునగు సేనా నాయకుల మీద కోపపడెను. మోషే వారితో... కాబట్టి మీరు పిల్లలలో ప్రతి మగవానిని పురుష సంయోగము ఎరిగిన ప్రతి స్త్రీని చంపుడి. పురుష సంయోగము ఎరుగని ప్రతి ఆడుపిల్లను మీ నిమిత్తము బ్రతుకనీయుడి'.

**జవాబు :** మీరు పవిత్రులుగా జీవించవలెనంటే పురుష సంయోగము ఎరుగని స్త్రీలతో వుండడము మంచిది. శతృశేష నిర్మూలనము మంచిది. ఇప్పుడున్న జనాంగము పాపముతో నిండియున్నది. ఈ ఆడుపిల్లల్లో మీ వలన పవిత్రులు పుట్టవచ్చునేమో!

# North East West South వార్తలు

## క్రైస్తవులకు ఇది తగదు

సాక్షి పత్రికలో పొరపాటున వచ్చిన క్రీస్తు ఫోటోపై ఆంధ్ర క్రైస్తవులు కొంచెం అతిగా ప్రవర్తించారనటంలో తప్పు లేదు. క్రీస్తుకి సంబంధం క్రైస్తవులతో కాదు, క్రీస్తును హృదయంలో కలిగియున్న వారితోనే. నేడు వేలమంది క్రైస్తవులు బహిరంగంగానే ధూమపానం, మద్యం సేవిస్తూ క్రీస్తును అవహేళన చేస్తున్నారు. ఒక్కసారి దగ్గర్లోని వైన్ షాపుల దగ్గర నిలబడి ఎంతమంది క్రైసవులు అందులోకి వెళ్తున్నారో లెక్క వ్రాయండి. మనకే సిగ్గేస్తుంది.

సాక్షి కావాలని ప్రచురించిన ఫోటో కాదది. అందుకే అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరూ సిగ్గుతో క్షమాపణ చెప్పారు. ఈ మధ్య ఒక పత్రిక బలహీన వర్గాలకు చెందిన కొందరు నాయకులను అవమానపరిచే విధంగా కొన్ని రాసినప్పుడు, ఆ బలహీన వర్గాలకు చెందిన నాయకులు ఆ పత్రిక యాజమాన్యమును క్షమాపణ చెప్పమని కోరినప్పుడు ఆ పత్రిక యాజమాన్యం ఏ మాత్రం మనస్సాక్షి లేకుండా ఎదురు తిరిగి ఇప్పటికీ బలహీన వర్గాలకు చెందిన వారికి క్షమాపణ చెప్పలేదు. పత్రికా రంగంలో 'క్షమించమని' అడిగిన 'సాక్షి' కార్యవర్గమునకు హృదయపూర్వక ధన్యవాదములు.

శత్రువుని క్షమించు అని చెప్పిన క్రీస్తు బోధలు పక్కన పెట్టిన క్రైస్తవత్వం అసలు క్షమించరానిది. క్రైస్తవులమైన మనము అన్యులకు చూపించగలిగిన మార్గదర్శకత్వం ఏముంది? క్రైస్తవులమైన మనము ఎప్పుడూ కూడ క్రీస్తు బోధలు తప్పి ఏ దాడులకు దిగవద్దని మనవి.

## వెంకయ్యా! ఏ దాడిని ఖండించాలో చెప్పవయ్యా!

సాక్షి పత్రికపై దాడిని ఖండించిన వారిలో అనేకులు ఉన్నారు. కాని దాడులను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని బిజేపి సీనియర్ నాయకుడు వెంకయ్యనాయుడు దాడులు ఖండించాలని వెంకయ్య ఒక శీర్షికలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వాదులు ఖండించాలంటే మతతత్వ శక్తులు దండించాలని కాబోలు వెంకయ్యనాయుడుగారి అభిప్రాయం.

భారతావనిలో క్రైస్తవత్వం ప్రవేశించిన ఈ రెండువేల సంవత్సరాలలో ఏనాడూ దాడులు చేయటం, ఇతరుల ప్రార్ధనా మందిరాలను కూల్చటం, మతబోధకులను చంపడం తెలియని మార్గమే క్రైస్తవ మార్గమని వెంకయ్యనాయుడుగారు గమనించగలరు. గతనెలలో హైదరాబాద్‌లో హైటెక్ రామాయణం ప్రదర్శనపై మతతత్వ శక్తుల దాడుల గురించి మాటలాడని వెంకయ్యనాయుడుగారు క్రైస్తవులను దాడులు చేసేవారిగా చిత్రీకరించడం మతోన్మాదానికి మచ్చుతునక.

## క్రైస్తవ మైనారిటీలకు ప్రత్యేక శాఖ

క్రైస్తవ మైనార్టీల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. మైనారిటీ శాఖ కింద వున్న వీరికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని సర్కారు యోచిస్తుంది. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాలు, ఉపకార వేతనాల్లో తమకు తగిన ప్రాధాన్యం లేదని క్రైస్తవులు ఇప్పటికే ప్రభుత్వానికి వెల్లడించారు. మైనారిటీ శాఖలో ప్రత్యేక విభాగం ద్వారా వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నట్లుగానే క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 13 లక్షలమంది క్రైస్తవులున్నట్లు అంచనా. వెనుకబడిన వున్న ఈ వర్గానికి సంక్షేమ పథకాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేకశాఖ ఏర్పాటు చేసి, మైనారిటీ శాఖలో అంతర్భాగంగా కొనసాగించాలని భావిస్తున్నారు.